విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి

విశాలాంధ్ర -వెలిగండ్ల : విద్యార్థిని విద్యార్థులు ఉన్నత చదువులు చదివేందుకు క్రమశిక్షణతో కూడిన విద్య అవసరమని ప్రకాశం జిల్లా డీసీఎంహెచ్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని వెలిగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు విద్యా పరిజ్ఞానం పై ప్రధానోపాధ్యాయులు గౌస్య బేగం అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సమాజంలో ఉన్న పరిజ్ఞానాన్ని అందిపుంచుకున్నందుకు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్ గంగాధర్, ఎంఈఓలు దాసు ప్రసాద్, రామిరెడ్డి మండల పార్టీ అధ్యక్షులు కేలం ఇంద్రభూపాల్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర ప్రకాశం జిల్లా

కేరళ గవర్నర్ చేతుల మీదుగా పీహెచ్‌డీ అందుకున్న యక్కంటి నాగేంద్ర రెడ్డి

విశాలాంధ్ర-పెద్ద దోర్నాల : కేరళ యూనివర్సిటీలో పీహెచ్ డిగ్రీ పట్టాను బుధవారం కేరళ రాష్ట్రంలో కేరళ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ చేతుల మీదుగా పీహెచ్డీ అందుకున్న యక్కంటి నాగేంద్ర రెడ్డి, పెద్ద దోర్నాల మండలం అయినా ముక్కుల గ్రామానికి చెందిన, యక్కంటి లింగారెడ్డి కుమారుడు నాగేందర్ రెడ్డి కేరళ వెటర్నరీ, యానిమల్ సైన్స్ యూనివర్సిటీ, వీహ్యాండ్‌లో జంతువుల ప్రజావనం, మరియు ప్రసూతి విభాగం, ప్రసవ వైద్య విభాగం నందు కేరళ యూనివర్సిటీ నందు హెచ్డి పూర్తి చేసి, గవర్నర్ చేతుల మీదుగా పీహెచ్డీ తీసుకున్న సందర్భంగా తోటి స్నేహితులు ఆనందం వ్యక్తం చేశారు.

ఎరువులు అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు

విశాలాంధ్ర-ముండ్లమూరు : ఫెర్టిలైజర్స్ ఎరువుల దుకాణదారులు ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు అమ్మితే కఠిన చర్యలు తప్పవని దర్శి వ్యవసాయ సహాయ సంచాలకులు కే.బాలాజీ నాయక్ అన్నారు. మండల కేంద్రమైన ముండ్లమూరులోని శ్రీనివాస ఫెర్టిలైజర్స్, గ్రోమోర్ సెంటర్ ఎరువుల దుకాణాలను గురువారం తనిఖీ చేశారు. ఎరువుల లైసెన్స్‌లో ఓ ఫార్మ్ అనుమతి లేని 12.4 టన్నుల ఎరువులు, 3,40,520 విలువగల ఎరువుల అమ్మకాలు నిలుపుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువుల డీలర్లు ఎరువుల వివరాలు స్టాక్ రిజిస్టర్‌లో ఎంటర్ చేసి రైతులు ఎప్పటికప్పుడు బిల్లులు ఇవ్వాలని, ఈపాస్ యంత్రంలో ఉన్న స్టాకు, భౌతికంగా ఉన్న స్టాకు సమానంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ స్టాకురిజిస్టర్లు, బిల్ బుక్స్ అప్డేట్ లో ఉంచుకోవాలని తెలియజేశారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు అమ్మితే ఎరువుల నియంత్రణ చట్టం 1985 ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఏ తిరుమలరావు, తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన

డీపీఓ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో ఎల్ బ్రహ్మయ్య

విశాలాంధ్ర-పామూరు రూరల్ : పచ్చ గ్రామం పరిశుభ్ర గ్రామం మారాలంటే సమిష్టిగా పనిచేయాలని డిపిఓ వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రమైన పామూరులోని ఎస్సీ కాలనీ నందు గురువారం తడి చెత్త, పొడి చెత్త, పై సేకరణ మరియు ఇంటి పన్నులను క్యూఆర్ కోడ్‌తో కట్టే విధానాన్ని ప్రజలకు అవగాహన కల్పించారు. డిపిఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇళ్ల నుంచి సేకరించిన తడి చెత్త ద్వారా పంచాయితీ సిబ్బంది కంపోస్టు యార్డులోనే వర్మీ ఎరువును తయారు చేసేవారు. ఉత్పత్తి చేసిన వర్మి ఎరువును, పొడి చెత్తను కూడా బహిరంగ మార్కెట్‌లో విక్రయించడం ద్వారా పంచాయతీకి ఆదాయం లభించేది. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎల్ బ్రహ్మయ్య, ఏఎంసీ చైర్మన్ యారవ రమా శ్రీనివాసులు, డిప్యూటీ ఎంపీడీవో హజరత్ అలీ, సుందర రామయ్య, పంచాయితీ అభివృద్ధి అధికారులు అరవింద రెడ్డి పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వాచ్‌మెన్ మృతి

విశాలాంధ్ర-టంగుటూరు : అనుమానాస్పద స్థితిలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వాచ్‌మెన్ మృతి చెందిన సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు మద్రిపూడి మండలం కూచిపూడి గ్రామానికి చెందిన యనమలమంద వెంకటరమణయ్య (55) 2000 సంవత్సరంలో రొయ్యల చెరువు దగ్గర, మరికొన్ని ప్రాంతాల్లో వాచ్‌మెన్‌గా పనిచేశారు. ప్రస్తుతం హెచ్‌డిఎఫ్‌సీ బ్యాంకు వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నారు. తన భార్య 2016లో మృతి చెందారు. అప్పటి నుంచి ఒక్కరే నివాసముంటున్నారు. మృతునికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు మధుసూదన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్‌పి రాయపాటి సాంబశివరావు తెలిపారు. డీఎస్పీ పర్యవేక్షణలో ఎస్ఐ నాగమల్లేశ్వరరావు, సింగరాయకొండ ఎస్ఐ హజరత్తయ్య బృందం డాగ్‌స్క్వాడ్‌తో పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శనలు

విశాలాంధ్ర -కంభం: మండలంలో గురువారం నిర్వహించిన మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకుని ఆలోచింపజేశాయి. ఈ కార్యక్రమాన్ని మండల విద్యాశాఖ అధికారులు అబ్దుల్ సత్తార్, శ్రీనివాసులు ప్రారంభించి, ప్రదర్శనలను పరిశీలించారు. సస్టైనబుల్ అగ్రికల్చర్, వేస్ట్ మేనేజ్మెంట్ అండ్ ఆల్టర్నేటివ్ ప్లాస్టిక్, గ్రీన్ ఎనర్జీ, ఎమర్జింగ్ టెక్నాలజీస్, రిక్రియేషనల్ మ్యాథమెటికల్ మోడలింగ్, హెల్త్ అండ్ హైజిన్, వాటర్ కన్జర్వేషన్ అండ్ మేనేజ్మెంట్ అంశాల నేపథ్యంలో విద్యార్థులు అపురూప ఆవిష్కరణలు ప్రదర్శించి అబ్బురపరిచారు. గురుకుల పాఠశాల విదార్థులు లహరి,శైలజ ప్రదర్శించిన ఫైర్ డిటెక్టర్ అలారం, జంగంగుంట్ల జడ్పీ హైస్కూల్ విద్యార్థి బి.మల్లికార్జున రూపొందించిన ఆర్గానిక్ ఫార్మింగ్, కంభం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి వై.రామకృష్ణ ప్రదర్శించిన ఎవైడింగ్ ప్లాస్టిక్, తురిమెళ్ల గవర్నమెంట్ హై స్కూల్ విద్యార్థి దినేష్ బాబు ప్రదర్శించిన టెస్లా కాయిల్, ఎల్ కోట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి ఖాసిం షరీఫ్ ప్రదర్శించిన నంబర్ ఆఫ్ ఇమేజెస్, కంభం బాలికోన్నత పాఠశాల విద్యార్థిని భవ్య శ్రీ రూపొందించిన విటమిన్ డి.బాత్, రావిపాడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి శివ కృష్ణ ప్రదర్శించిన ఎమర్జింగ్ టెక్నాలజీస్, ఉపాధ్యాయుల ప్రదర్శన విభాగంలో రావిపాడు జడ్పీ ఉన్నత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు మధుసూదన్ రావు ప్రదర్శించినలో కాస్ట్ మైక్రోస్కోప్ అత్యుత్తమ ప్రదర్శనగా నిలిచాయి. గురుకుల పాఠశాల విద్యార్థిని దివ్య ప్రదర్శించిన ఫుడ్ న్యూట్రీషియన్ వివరణ, అర్బన్ కాలనీ ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయుడు హబిబుర్ రెహమాన్ ప్రదర్శించిన గణిత నమూనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో మండలంలోని అన్ని పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం పదవి కూడా పీపీపీ పద్ధతిలోకి తెస్తారా..?

- ఎన్డీఏ కూటమి మొదటి నుంచి ప్రభుత్వరంగ సంస్థలకు వ్యతిరేకం
- కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలకు అనుగుణంగానే చట్టాలు
- మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ దారుణం
- 70 శాతం నిర్మాణ పనులు పూర్తయినా ప్రైవేటుపరం చేస్తారా..?
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య ధ్వజం
- మెడికల్ కళాశాల వద్ద సీపీఐ ఆధ్వర్యంలో వంటవార్పు

విశాలాంధ్ర-మార్కాపురం :
ప్రైవేటీకరణ వైపు నిత్యం జపం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన ముఖ్యమంత్రి పదవిని కూడా పీపీపీ పద్ధతిలో కేటాయిస్తే బాగుంటుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య వ్యంగ్యంగా అన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక మెడికల్ కళాశాల వద్ద గురువారం వంటవార్పు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి పార్టీ జిల్లా సహాయక కార్యదర్శి వెంకట్రావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఈశ్వరయ్య మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి మొదటి నుంచి ప్రభుత్వరంగ సంస్థలకు వ్యతిరేకమని పెట్టుబడిదారి, కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలకు అనుగుణంగా చట్టాలు తయారు చేయడమే వారి పని అని విమర్శించారు. ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా అన్ని రంగాల్లో వెనుకబడిన పశ్చిమ ప్రాంతంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ దాదాపు 70 శాతం నిర్మాణ పనులు పూర్తి అయిన సందర్భంలో ఇటువంటి కాలేజీని ప్రైవేటుపరం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 590 జారీ చేయడం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే ప్రభుత్వరంగ సంస్థలను కాపాడటంతో పాటు మరింతబలోపేతం చేస్తానని పదేపదే ఎన్నికల ముందు చెప్పిన చంద్రబాబు తీరా అధికారం చేపట్టాక అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. అందులో

భాగంగానే మెడికల్ కాలేజీలను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్నారని విమర్శించారు. మెడికల్ కాలేజీల కోసం ప్రభుత్వం సమకూర్చుకున్న 60 ఎకరాలకు పైగా భూములు నేడు కోట్ల రూపాయల విలువ చేస్తాయని అలాగే కాలేజీలకు ఇండియన్ మెడికల్ కౌన్సిల్ అనుమతులను కూడా గత ప్రభుత్వం తీసుకొచ్చిందని అన్నారు. అన్ని వడ్డించిన విస్తరాకులు తీసుకెళ్లి ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టడం ఈ ప్రాంత ప్రజలను తీవ్రంగా మోసం చేయడమేనని విమర్శించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేస్తే సహించే ప్రశ్నే లేదని ఇందుకోసం పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారు. నిత్యం కరువు కాటకాలతో సతమతమవుతున్న పశ్చిమ ప్రకాశానికి వరప్రసాదమైన పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన చేసి 30 సంవత్సరాలు దాటుతున్నప్పటికీ నేటికీ నిర్మాణ పనులు పూర్తి చేయకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు తీరని అన్యాయం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఓట్లకోసం ప్రాజెక్టు జపం చేస్తూ కల్లబొల్లిమాటలు చెప్పి ఓట్లు వేయించుకోవడం తీరా ఎన్నికల అనంతరం ప్రజలను మోసం చేయడం ఈ పాలకవర్గాలకు అలవాటుగా మారిందని విమర్శించారు. 5వేల కోట్ల రూపాయల నిధులు కేటాయిస్తే వెలుగొండ ప్రాజెక్టు 6వేల కోట్లు కేటాయిస్తే మెడికల్ కాలేజీలు పూర్తి అవుతాయని ఈ 11 వేల కోట్ల రూపాయలను వెచ్చించడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కారం కావాలంటే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టాలని అందుకు పార్టీ కార్యకర్తలందరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి సోమయ్య మాట్లాడుతూ మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సాగే ఉద్యమంలో ఐక్యంగా ముందుకెళ్దామని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కేవీ కృష్ణగౌడ్, ఎస్‌కె యాసిన్, సీనియర్ నాయకులు అందె నాసరయ్య, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఎస్‌కె కాశిం, పార్టీ నాయకులు బాణాల రామయ్య, డి శ్రీనివాస్, ప్రభాకర్, కరుణానిధి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్‌కె మహబుబ్‌వలి పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ యువజన మాస పత్రిక ఆవిష్కరణ

అఖిలభారత యువజన సమైక్య మసపత్రికను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య ఈశ్వరయ్య ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ప్రభాకర్, కరుణానిధి పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ Union Bank of India
రాజ్‌భవన్ రోడ్ బ్రాంచ్ (4901)
రాజ్‌భవన్ రోడ్, హైదరాబాద్
తెలంగాణ-500004

Ref: SAR4901901394549203832526 Date:28/11/2025

సర్ఫేశీ చట్టం, 2002 సెక్షన్ 13 (2) కింద డిమాండ్ నోటీసు

టు : రుణగ్రహీతలు: 1(ఎ) ఎం/ఎస్. డిస్కవరీ, యజమాని శ్రీ దేవగిరి శ్రీనివాస రెడ్డి ద్వారా ప్రాతినిధ్యం వహించబడుతున్నది, కార్యాలయం: ఫ్లాట్ నెం 113, హెచ్. నెం.6-3-1091/13-15/113, అమృత విల్లే అపార్ట్‌మెంట్స్, బ్లాక్ నెం 3, వార్డ్ నెం 6, జిహెచ్ఎంసి ఖైరతాబాద్ సర్కిల్, హైదరాబాద్-500004. 1(బి) ఎం/ఎస్. డిస్కవరీ, యజమాని శ్రీ డి. శ్రీనివాస రెడ్డి తండ్రి శ్రీ డి. సుబ్బారెడ్డి, ఫ్లాట్ నెం 2-ఎల్‌హెచ్ 1201, లాంకో హిల్స్, మణికొండ, హైదరాబాద్-500089. 2(ఎ) శ్రీ దేవగిరి శ్రీనివాస రెడ్డి, కార్యాలయం ఫ్లాట్ నెం.113, ఇంటి నెం.6-3-1091/13-15/113, అమృత విల్లే అపార్ట్‌మెంట్స్, బ్లాక్ నెం 3, వార్డ్ నెం 6, జిహెచ్ఎంసి ఖైరతాబాద్ సర్కిల్, హైదరాబాద్-500004. 2(బి) శ్రీ డి. శ్రీనివాస రెడ్డి, తండ్రి శ్రీ డి. సుబ్బారెడ్డి ఫ్లాట్ నెం.2-ఎల్‌హెచ్ 1201, లాంకో హిల్స్, మణికొండ, హైదరాబాద్-500089. హామీదారు: 3. డి. రామ మోహన్ రెడ్డి, తండ్రి శ్రీ డి. సుబ్బారెడ్డి, పోలూరు పోస్ట్, యద్దనపూడి మండలం, ప్రకాశం జిల్లా-523171

సర్/మేడం,

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 లోని సెక్షన్ 13 (3)తో కలిపి చదివే సెక్షన్ 13 (2) కింద నోటీసు.

ఇక్కడ పేర్కొన్న చిరునామాదారులు నెం. 1, 2 మరియు 3 మా రాజ్‌భవన్ రోడ్ బ్రాంచ్ (04901) నుండి ఈ క్రింది క్రెడిట్ సౌకర్యాలను పొందారు. మరియు బకాయిలు/వాయిదాలు/వడ్డీని చెల్లించడంలో/ఖాతాలను సంతృప్తికరంగా నిర్వహించడంలో విఫలమయ్యారు. అందువల్ల, ఆదాయ గుర్తింపు మరియు వివేకవంతమైన అకౌంటింగ్ నిబంధనలకు సంబంధించి ఆర్‌బీఐ మార్గదర్శకాల ప్రకారం, మీ రుణఖాతాలు 19/11/2025 నాటికి నిరర్థక ఆస్తిగా వర్గీకరించబడ్డాయి. 28.11.2025 నాటికి, మీ ఖాతా/ఖాతాలలో రూ.40,61,108.87/- (నలభై లక్షల అరవై ఒక్క వేల నూట ఎనిమిది రూపాయల ఎనభై ఏడు పైసలు మాత్రమే) మొత్తం బకాయి ఉంది.

పైన పేర్కొన్న ఖాతా/ఖాతాలకు సంబంధించి మీలో నెం. 1(ఎ), 1(బి), (2) మరియు (3) నుండి బ్యాంకుకు చెల్లించవలసిన మొత్తం వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి:

సౌకర్య స్వభావం / ఎస్‌ఓడీ-ఇతరులు	ఎన్‌పీఏ తేదీ అనగా 19.11.2025 నాటికి మొత్తం బాకీ	28.11.2025 వరకు వర్తించబడని వడ్డీ	పీనల్ వడ్డీ (సరళం)	బ్యాంకు వెచ్చించిన వ్యయం/ఛార్జీలు	మొత్తం బకాయిలు
04903110000089	40,17,349.87	43,759.00	0.00	0.00	40,61,108.87
మొత్తం బకాయిలు:					40,61,108.87

బ్యాంకుకు చెల్లించాల్సిన లేదా భవిష్యత్తులో చెల్లించవలసి వచ్చే సొమ్ముకు హామీగా, శ్రీ దేవగిరి శ్రీనివాస రెడ్డి గారు 01.09.2015 తేదీన పత్రాలను (తాకట్టు దస్తావేజు నెం. 1895/2015 ద్వారా) అమలు చేసి, ఈ క్రింది విధంగా సెక్యూరిటీ ఆసక్తిని సృష్టించారు:

హామీగా పెట్టిన ఆస్తుల వివరాలు ఈ కింద పేర్కొనబడినవి:

సోమాజిగూడ, అమృత విల్లా అపార్ట్‌మెంట్స్, యశోదా ఆస్పత్రి ఎదుట, రాజ్‌భవన్ రోడ్డు, హైదరాబాద్ వద్ద ప్రిమిసెస్ నం.6-3-1091/13 నుండి 15, సర్వే నం.లు 14&15లో 1432 చదరపు అడుగుల నిర్మిత ప్రదేశం మరియు సెల్లార్ లో గ్యారేజ్ నం.64తో యూనిట్ నం.13, 1వ అంతస్తు (ఫ్లాట్ నం.113)తో పాటు మొత్తం 5741.60 చదరపు గజాల నుండి 1/144.26వ వంతు 39.80 చదరపు గజాల అవిభాజ్య భూమి వాటాతో కూడిన ఆస్తి మొత్తంగా. హద్దులు: ఉత్తరం: ఓపెన్ టు స్కై, దక్షిణం: కారిడార్, తూర్పు: ఫ్లాట్ నం.112, పడమర: ఫ్లాట్ నం.114.

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002లోని సెక్షన్ 13(2) ప్రకారం ఈ నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోపు మీరు తీసుకున్న రుణ పత్రాల నిబంధనలు మరియు షరతుల ప్రకారం ఒప్పందపు రేటుతో అదనపు వడ్డీ మరియు ఛార్జీలతో సహా రూ. 40,61,108.87/- (నలభై లక్షల అరవై ఒక్క వేల నూట ఎనిమిది రూపాయల ఎనభై ఏడు పైసలు మాత్రమే) ల బకాయి మొత్తాన్ని చెల్లించాలని ఈ నోటీసు ద్వారా మీకు తెలియజేయడమైనది. అలా చేయని పక్షంలో, సదరు చట్టం కింద ఇవ్వబడిన ఏదైనా లేదా అన్ని హక్కులను వినియోగించుకోవడం ద్వారా మేము పైన పేర్కొన్న సెక్యూరిటీలను అమలు చేయడానికి కట్టుబడి ఉంటాము. చట్టంలోని సెక్షన్ 13 (13) ప్రకారం, ఈ నోటీసు అందిన తర్వాత, బ్యాంకు సమ్మతి లేకుండా పైన పేర్కొన్న సెక్యూరిటీలను విక్రయించడం లేదా వాటితో వ్యవహరించడం నుండి మీరు నిరోధించబడ్డారు.

హామీగాపెట్టిన ఆస్తులను విడిపించుకోడానికి అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి సర్ఫేసీ చట్టం యొక్క సెక్షన్ 13లోని సబ్-సెక్షన్ (8) యొక్క నిబంధనలను దయచేసి గమనించవలసిందిగా మిమ్మల్ని కోరడమైనది.

తేదీ : 28.11.2025, ప్రదేశం : హైదరాబాద్ సం/-అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

విద్యార్థుల సంక్షేమమే లక్ష్యంగా ముందడుగు

యర్రగొండపాలెం టీడీపీ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబు

విశాలాంధ్ర-పుల్లలచెరువు : యర్రగొండపాలెం నియోజకవర్గంలో విద్యార్థుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, పుల్లలచెరువు పట్టణంలో అసంపూర్తిగా నిలిచిపోయిన విద్యా వసతి భవనాలను యర్రగొండపాలెం టీడీపీ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబు గురువారం పరిశీలించారు. పట్టణంలో నిర్మాణ దశలోనే నిలిచిపోయిన స్త్రీ శక్తి భవనం, కస్తూర్బా గాంధీ బాలికల జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వసతి గృహాల పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. హాస్టళ్లలో ప్రస్తుతం ఉన్న వసతులు, మౌలిక సదుపాయాలపై అధికారులతో సమీక్ష నిర్వహించిన ఆయన, విద్యార్థులకు నాణ్యమైన భోజనం, తాగునీరు, పరిశుభ్రమైన వసతి, విద్యుత్, మరుగుదొడ్లు, భద్రత వంటి సౌకర్యాలు తప్పనిసరిగా కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మరియదాస్, ఎంఈఓ ఇందిరా ప్రసాద్, ఏపిఎం వెంకటయ్య, ఇఓఆర్ డి.ఆత్మ నాయుడు, ఎంపీపీ వెంకటయ్య, సి.రెంటపల్లి సుబ్బారెడ్డి, టిడిపి మండల మాజీ కన్వీనర్ పయ్యావుల ప్రసాద్, ఆయకట్టు ప్రెసిడెంట్ కొలుకులూరి కుమార్, టిడిపి పట్టణ అధ్యక్షులు మేడికొండ అనిల్, మాజీ ఏఎంసి డైరెక్టర్ ఉప్పల హనుమంత్, ఎర్రయ్య, సొసైటీ డైరెక్టర్ గద్దె వెంకటేశ్వర్లు, టిడిపి మాజీ మండల కన్వీనర్ మేడికొండ లక్ష్మి నారాయణ, కస్తూర్బా ఎస్ ఓ లిల్లీ ప్రకాష్ వాణి, మండల ఉపాధ్యక్షులు కాయ కోకుల ఇదెమ్మ, అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువతకు అవగాహన కల్పిస్తాం

విశాలాంధ్ర - గిద్దలూరు : స్థానికంగా తయారైన వస్తువులను విరివిగా కొనుగోలు చేసి స్థానిక ప్రజలకు ఉపాధి కల్పించే విషయంలో యువతకు అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టినట్లు కనిగిరి గిద్దలూరు నియోజకవర్గాల బిజెపి పార్టీ ఇన్చార్జి జేవీ నారాయణ గిద్దలూరు పట్టణ బిజెపి అధ్యక్షుడు ఉదయ్ శంకర్ తెలిపారు. గురువారం సాయంత్రం పట్టణంలోని వివిధ ప్రదేశాల్లో స్థానికత స్వదేశీ వస్తువుల విక్రయాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గిద్దలూరు కనిగిరి నియోజకవర్గం ఇన్చార్జి జేవినారాయణ పట్టణ అధ్యక్షుడు ఉదయ శంకర్‌లు మాట్లాడుతూ ప్రజల్లో స్థానికంగా తయారైన వస్తువులను కొనుగోలు చేత ద్వారా దేశంగా తయారైన వస్తువుల అమ్మకాలు పెరిగి ప్రపంచ దేశాల్లో భారత్ ఆర్థికంగా బలపితమవుతుందని వారన్నారు. వ్యాపారులతో సమావేశాలు, యువతకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని అప్పిశెట్టి ఉదయ్ శంకర్ తెలిపారు. స్వదేశీ వస్తువులు వినియోగించడం ద్వారా దేశ సంపద దేశంలోనే నిలిచి, భారతదేశం నిజమైన అర్థంలో స్వయం సమృద్ధిగా మారుతుందని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో గిద్దలూరు బిజెపి టౌన్ వైస్ ప్రెసిడెంట్ నాగేశ్వరరావు, జనార్ధన్, టౌన్ వైస్ ప్రెసిడెంట్ రామకృష్ణ, జిల్లా బిజెపి మాజీ అధ్యక్షుడు రామాంజనేయులు, బీజేపీ నాయకులు పోతులూరి, కార్యకర్తలు పాల్గొని ఆత్మనిర్భర్ భారత్ అభియాన్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని నిర్ణయించారు.

సురక్షిత ప్రయాణమే లక్ష్యం

విశాలాంధ్ర-కనిగిరి : రోడ్డు భద్రతపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించాలనే లక్ష్యంతో గురువారం ప్రకాశం జిల్లా రవాణా శాఖ అధికారి సత్యనారాయణ విద్యార్థులతో కలిసి ఆర్‌టీసీ బస్సులో ఇర్లపాడు లక్ష్మక్క పల్లి, లింగన్న పాలెం వెళ్లి అక్కడనుండి తిరుగుప్రయాణంలో బొడ్లగూడూరు బోడవాడ వరకు విద్యార్థులతో ప్రయాణం చేసి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. బస్సులో ప్రయాణిస్తున్న విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రతా నియమాలు వంటి అంశాలపై వివరించారు. చిన్న వయసులోనే ట్రాఫిక్ నియమాలపై అవగాహన కలగడం ఎంతో అవసరమని పేర్కొన్నారు.ఆర్టీసీ బస్సుల లభ్యత, సమయపాలన, భద్రత వంటి అంశాలపై విద్యార్థుల అభిప్రాయాలు తెలుసుకోవడం జరిగింది.ప్రభుత్వం అందిస్తున్న రాయితీలతో బాగా చదువుకొని చిన్న వయస్సు లోనే భవిష్యత్తుకు పునాది వేసుకోవాలని తెలిపారు. బస్సులో ప్రయాణించే సమయంలో క్రమశిక్షణ పాటించాలని డ్రైవర్‌కు కండక్టర్‌కు ఇబ్బంది కలిగించేలా ప్రవర్తించకూడదని సూచించారు.అలాగే భావి భారత పౌరులైన విద్యార్థులు బస్సు ఎక్కేటప్పుడు దించేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని డ్రైవరు కండక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమాలు విద్యార్థులకు రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచడంలో, ప్రభుత్వ పథకాలను వారికి చేరవేయడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని ఆయన అన్నారు. కనిగిరి డిపో మేనేజర్ మహమ్మద్ సయనా బేగం, అధికారులు, ఆర్‌టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభించిన ఎంపీడీవో

విశాలాంధ్ర-బేస్తవారిపేట : స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఎంపీడీవో ఏవీ రంగనాయకులు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులు తయారు చేసిన వివిధ ప్రాజెక్టులను పరిశీలించి అభినందించారు. ఈ కార్యక్రమంలో బేస్తవారిపేట ఎంఈఓలు ఎస్ మధుసూదన్ రెడ్డి, సీవీ రమణారెడ్డి, పాఠశాల ఇంచార్జీ హెడ్ మిస్ట్రెస్ అనూరాధ, మండలంలోని అన్ని పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జముకులదిన్నే గ్రామ పంచాయతి

దర్శి మండలం, ప్రకాశం జిల్లా
టెండర్-కం-బహిరంగ వేలం ప్రకటన

ఆర్.ఓ.సి నెం - 07/2025 తేది : 19-12-2025

ప్రకాశం జిల్లా దర్శి మండలం **జముకులదిన్నే** గ్రామపంచాయతీ పరిధిలో గ్రామపంచాయతి చేపల చెరువులో చేపలు వేసి పెంచి పట్టుకొనుటకుగాను **2025-26, 2026-27 మరియు 2027-28** అనగా మూడు సంవత్సరములకు టెండర్-కం-బహిరంగ వేలం **తేదీ 29-12-2025న ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 3.00** గంటల వరకు శ్రీయుత జిల్లా పంచాయతి అధికారి వారి సమక్షంలో లేదా వారి అనుమతి పొందిన వారి సమక్షంలో **జముకులదిన్నే** గ్రామ సచివాలయం వద్ద టెండర్-కం-బహిరంగ వేలం పద్దతి ద్వారా జరపబడును.

షరతులు

1. **జముకులదిన్నే** గ్రామ సచివాలయం వద్ద అదే రోజు **రూ.1000/-లు** చెల్లించి ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 12.00 గంటలలోపు టెండర్ ఫారం పొందవలెను.
2. పూర్తి చేసిన టెండర్ షెడ్యూలు ఫారం ఆదేరోజు మధ్యాహ్నం 1.00 గంటల వరకు మాత్రమే స్వీకరించబడును. అనంతరం 3 గంటలకు హాజరు అయిన వేలం పాటదారుల సమక్షంలో బహిరంగ వేలం నిర్వహించబడును.
3. సీల్డు టెండర్ కం షెడ్యూలు ఫారంతో **రూ 4,50,000/-లు** ఏదైన బ్యాంక్‌నుండి పంచాయతి కార్యదర్శి, గ్రామపంచాయతి, **జముకులదిన్నే** పేరుమీద డి.డి తీసి జతపరచవలెను
4. బహిరంగ వేలములో పాల్గొనేవారు దరావత్తు క్రింద **రూ.4,50,000/-లు** ముందుగా చెల్లించి వేలములో పాల్గొనవలెను.
5. టెండరు-కం వేలములో పాల్గొనువారు **రూ.5,00,000 లకు** సాల్వెన్సీ సర్టిఫికేటు సమర్పించవలెను.
6. ప్రభుత్వ మద్దతు ధర **రూ.18,00,000/-** రాని యెడల టెండరు కం బహిరంగ వేలము వాయిదా వేయుటకు మరియు రద్దు పరచుటకు పంచాయితీకి పూర్తి అధికారము కలదు.
7. టెండరులోగాని లేదా బహిరంగ వేలములోగాని ఏది హెచ్చు మొత్తము అయినచో దానిని మాత్రమే స్వీకరించబడును.
8. పాటకు చెల్లించు ధరావత్తును చివరి సంవత్సరము కిస్తీలో జమచేసుకొనబడును.
9. టెండు కం బహిరంగవేలంపాటలో వచ్చిన హెచ్చు మొత్తమును మూడు సమాన కిస్తీలుగా విభజించి ఏ సంవత్సరము కిస్తీ ఆ సంవత్సరము జూలై నెల మొదటి వారంలో చెల్లించి చెరువులో చేపపిల్లలను వేసుకొనవలెను. అట్లు చెల్లించనిచో వారి టెండరు కం బహిరంగ వేలం పాటను రద్దుచేసి తిరిగి వేలం పాటను నిర్వహించబడును. మరల జరుగు వేలం పాటలో తక్కువ మొత్తమునకు వచ్చిన ఎడల నష్టమును మొదటి పాటదారుని నుండి వసూలు చేయబడును.
10. రైతుల ప్రయోజనమునకు ఎటువంటి నష్టము కలిగించరాదు.
11. టెండరు కం బహిరంగ వేలంపాట జరిగిన **15 రోజులలో** మొదటి సంవత్సరము కిస్తీ చెల్లించి పంచాయితీ వారికి స్టాంప్ మరియు రిజిస్ట్రేషన్ చట్టము ప్రకారం పంచాయితీ వారికి రిజిస్టర్ చేయవలెను.
12. ప్రకృతి వైపరీత్యముల వలనకానీ మరియు ఏ ఇతర కారణముల వలనగానీ చెరువులోని చేపలకు నష్టము కలిగినచో ఆ నష్టమునకు పంచాయితీ వారికి ఎటువంటి బాధ్యత లేదు. అన్నియు పాటదారుడే భరించనెను.
13. ప్రకృతి వైపరీత్యముల వలన నష్టము వాటిల్లినచో వేలం కాలపరిమితి పొడిగించుటకుగాని సదరు మొత్తం వేలంపాట కిస్తీ రద్దు పరుచుటగాని వీలుపడదు.
14. వేలం యొక్క కాలపరిమితి **2025-26, 2026-27 మరియు 2027-28 అనగా 3** సంవత్సరములు అనగా **తేది 01-07-2025 నుండి 30-06-2028 వరకు** అనగా మూడు సంవత్సరములకు మాత్రమే.
15. ప్రకృతి వైపరీత్యముల వలన జరిగిన నష్టములకు గ్రామ పంచాయతి ఎలాంటి నష్టపరిహారం చెల్లించదు.
16. కిస్తీని పూర్తిగా పంచాయితీ షరతుల మేరకు చెల్లించి పంచాయితీ కార్యదర్శి గారి లిఖితపూర్వకమైన ఉత్తర్వులు పొంది చెరువులో చేపలను పెంచుకొనవలెను.
17. పంచాయితీకి బకాయిలు ఉన్నవారు వేలం పాటలో పాల్గొనుటకు అనర్హులు.
18. హెచ్చుపాటదారు ఇన్స్యూరెన్సు చేయించుకొనవలెను.
19. టెండరు షరతులు మిగతా వివరములు కార్యాలయము పనిచేయువేళలో వచ్చి తెలుసుకొనవచ్చును.

సం/- దారం శ్రీనివాసరెడ్డి
పంచాయితీ కార్యదర్శి,
జముకులదిన్నే గ్రామపంచాయితీ,
దర్శి మండలం ప్రకాశం జిల్లా,

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి

విశాలాంధ్ర-కొండేపి : విద్యార్థులకు మిడ్ డే మీల్స్ మెనూ ప్రకారం అందించాలని కొండపి మండలం అభివృద్ధి అధికారి రామాంజనేయులు హై స్కూల్ సిబ్బందికి సూచించారు. కొండపి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను గురువారం ఎంపీడీవో రామాంజనేయులు తనిఖీ చేశారు. హైస్కూల్లోని విద్యార్థుల తరగతి గదులను, టాయిలెట్స్ శుభ్రంగా ఉన్నాయా లేదా అని పరిశీలించారు. విద్యార్థులతో సరదాగా ఎలా చదువుతున్నారు టీచర్లు చదువు ఎలా చెబుతున్నారు అని అడిగి తెలుసుకున్నారు. చదువు అనేది చాలా ముఖ్యమని, చదువుకుంటే మంచి ఉన్నత స్థాయిలో ఉంటారని, చదువులో ఉన్న గొప్పతనం విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు భోజనం, వెజిటేబుల్ బిర్యాని కోడుగుడ్డు, సాంబార్ని ఎంపీడీఓ రుచి చూసి చూశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సక్రమంగా భోజనం అందించాలని,నీళ్ల ట్యాంకులను ప్రతిరోజు శుభ్రపరచుకోవాలని సూచించారు. అనంతరం విజ్ఞాన ప్రదర్శనలను చూసిన అబ్దుల్ కలాంని ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులు నేటి బాలలే రేపటి పౌరులుగా గొప్ప శాస్త్రవేత్తలుగా ఏదగాలని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కమ్మవారి సేవా సంఘం జిల్లా కార్యవర్గం ఏకగ్రీవం

విశాలాంధ్ర- ఒంగోలు : ప్రకాశం జిల్లా కమ్మవారి సేవా సంఘం అధ్యక్షులుగా మండవ మురళీకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రకాశం జిల్లా కమ్మవారి సేవా సంఘం కార్యవర్గమునకు జరిగిన ఎన్నికల్లో కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి న్యాయవాది ముప్పరాజు నాగేశ్వర రావు ఒంగోలు నిర్మల్ నగర్లోని సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ప్రకటించారు. ప్రకాశం జిల్లా కమ్మవారి సేవా సంఘం నూతన అధ్యక్షుడిగా మండవ మురళీకృష్ణ, ప్రధానకార్యదర్శి ఆలా హనుమంత రావు, ఉపాధ్యక్షులుగా అబ్బూరి నవీన్ కుమార్, పావులూరి బాపయ్య చౌదరి, కోటపాటి కాశీరావు, కోశాధికారిగా మందాడి రాఘవ రావు,సంయుక్త కార్యదర్శిగా రావుల పద్మజ మరియు 18 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మండవ మురళీకృష్ణ మాట్లాడుతూ ఏకగ్రీవ ఎన్నికకు సహకరించిన వారందరికీ కృత్జతలు తెలిపారు. గత సంవత్సర కాలంలో మా అడ్హాక్ కమిటీ ఎన్నో కార్యక్రమాలను చేపట్టామని, భవిష్యత్తులో మీ అందరి సహకారంతో విద్య, వైద్యం, స్వయం ఉపాధి, క్రీడలు వంటి అంశాలలో ప్రోత్సహిస్తామని చెప్పారు.

21న పల్స్ పోలియో

విశాలాంధ్ర-పొన్నలూరు : ఈ నెల 21న పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైద్య అధికారి డాక్టర్ కృష్ణ చైతన్య తెలిపారు. గురువారం ప్రాథమిక వైద్యశాల ఆవరణలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో కృష్ణ చైతన్య మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలలో గల ఐదు సంవత్సరముల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు అందించాలని మండలంలో 25 పోలియో కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలో మొత్తం 3006 మంది పిల్లలు ఉన్నారని వారి అందరికీ పోలియో చుక్కలు అందించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

కనిగిరి ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు

విశాలాంధ్ర-పీసీపల్లి : ప్రకాశం జిల్లా తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షునిగా ఎన్నికైన కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డికి పీసీపల్లి మాజీ ఎంపీటీసీ వేమూరి సుబ్బారావు శుభాకాంక్షలు తెలియజేశారు. గురువారం మంగళగిరి తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయంలో ఉగ్రకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

పేద విద్యార్థులకు కిరణ్, జగన్ చేయూత

విశాలాంధ్ర - తర్లుపాడు : తర్లుపాడు మండలంలోని జగన్నాథపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మార్కాపురం వాస్తవ్యులు,ప్రకాశం జిల్లా వాసవి క్లబ్ గవర్నర్ గంగిశెట్టి కిరణ్ కుమార్ 150 లాంగ్ నోట్ పుస్తకాలను, జగన్నాథపురం పాఠశాల ప్రధానోపాధ్యాయులు కశెట్టి జగన్ 50 చిన్న సైజు నోటుబుక్స్,పెన్స్ ఉచితంగా అందజేశారు. ప్రధానోపాధ్యాయులు కశెట్టి జగన్ మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా విద్యార్థులకు 75 రోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేయమని కోరిందన్నారు.దానికి సంబంధించి ఒక్కొక్క విద్యార్థికి మూడు నోట్ బుక్స్ అవసరమని కిరణ్ కుమార్ దృష్టికి తీసుకువెళ్లగా,వెంటనే స్పందించి, 4500 రూపాయల విలువ గల పుస్తకా లను దాత గంగిశెట్టి కిరణ్ కుమార్ ఇవ్వడం జరిగిందన్నారు. ఉచితంగా పుస్తకాలు అందించిన కిరణ్ కుమార్,జగన్ బాబులను గ్రామస్తులు అభి నందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయిని ఎం.అనూష పాల్గొన్నారు.

ఒంగోలులో ఏబీవీపీ రాష్ట్ర మహాసభలు

బీజేపీ నేత డాక్టర్ ఏలూరి

విశాలాంధ్ర-పెద్ద దోర్నాల : ప్రకాశం జిల్లా ఒంగోలు పట్టణంలో ఈ నెల 18 నుండి 20 వ తేదీ వరకు మూడు రోజులపాటు జరుగనున్న అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) 44వ రాష్ట్ర మహాసభలను విద్యార్థులు, యువత, విద్యావేత్తలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఏబీవీపీ కార్యకర్తగా పనిచేసే అదృష్టం తనకు దక్కిందని అన్నారు. విద్యార్థుల్లో దేశభక్తి, జాతీయత, సామాజిక బాధ్యతను పెంపొందించడంలో ఏబీవీపీ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. జిల్లా ప్రజలు, విద్యాసంస్థలు, విద్యార్థులు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఆకట్టుకున్న విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

విశాలాంధ్ర-మార్కాపురం : మండల విద్యాశాఖ అధికారిణి కె.శార్వాణి ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల మార్కాపురం నందు జరిగిన మండల స్థాయి విద్యా వైజ్ఞానిక సదస్సును గురువారం ఘనంగా నిర్వహించడం జరిగింది. విద్యార్థుల్లో ప్రతిభాపాటవాలను వెలికి తీసేందుకు, వారిలోని సృజనాత్మకత ఆలోచన విధానాలను పెంపొందించుటకు గాను ఏడు ప్రాధాన్యత అంశాలలో నిర్వహించిన ఈ వైజ్ఞానిక ప్రదర్శనలో మండల పరిధిలోని వివిధ పాఠశాలల నుండి మొత్తం 86 ప్రాజెక్టులను ప్రదర్శనకు ఉంచడం జరిగింది. సుస్థిర వ్యవసాయం మరియు అభివృద్ధి, వ్యర్థాల నిర్వహణ మరియు గ్రీన్ ఎనర్జీలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నతపాఠశాల మార్కాపురం, ఎమర్జింగ్ టెక్నాలజీ మరియు గణిత రిక్రియేషనల్ మోడల్ విభాగలలో బాలుర ఉన్నతపాఠశాల మార్కాపురం, ఆరోగ్యం పరిశుభ్రత విభాగంలో బూపతిపల్లి ఉన్నతపాఠశాల, నీటి పరిరక్షణ మరియు నిర్వహణ నందు బాలికల పాఠశాల మార్కాపురం, ఉపాధ్యాయ విభాగంలో బి.రాధారాణి భౌతిక శాస్త్ర ఉపాధ్యాయురాలు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల మార్కాపురం వారు ఎంపిక అయినట్లు వీరు రేపు ఓంగోలులో జరిగే జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ లో హాజరు కావాలని శర్వాణి తెలియజేశారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా మైనంపాడు డైట్ కళాశాల ప్రిన్సిపల్ సామ సుబ్బారావు హాజరయ్యారు. న్యాయ నిర్ణేతలుగా శ్రీధర్ బాబు శేషు కుమార్‌లు వ్యవహరించారు. ఈ వైజ్ఞానిక సదస్సులో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వి.శ్రీదేవి బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునగాల చంద్రశేఖర్ రెడ్డి దరిమడుగు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరుపతిరెడ్డి, గజ్జలకొండ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్యామ్ సుభాకర్..జమ్మన పల్లి ప్రధానోపాధ్యాయులు జె.నాగయ్య, ఆయా పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులు హాజరయ్యారు.

వినూత్న ఆలోచనా ధోరణి పెంచేందుకే వైజ్ఞానిక ప్రదర్శనలు

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : యర్రగొండపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలను ఎంఇఓ పి.ఆంజనేయులు పాఠశాలలోని 10 వ తరగతి టాపర్ విద్యార్థిని యస్ కె.అర్షియాతో కలిసి ప్రారంభింపచేసి విద్యార్థులలో స్ఫూర్తి నింపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యార్థిలో ఏదో ఒక క్రొత్త ఆలోచన విధానం స్ఫురిస్తూ వుంటుందనీ దానిని సక్రమమైన మార్గంలో పదును పెట్టాల్సిన అవసరం ఉపాధ్యాయులపై వుంటుందన్నారు. పాఠశాల స్థాయిలో విద్యార్థులను వినూత్నంగా ఆలోచింప చేయాలనీ ఎక్కువగా విద్యార్థులు సమస్యలు అడిగే ఆలోచనా ధోరణి పెంపొందించాలన్నారు. కృత్యాధారిత బోధన ద్వారా, నేడు డిజిటల్ విధానంలో ప్రతీ వ్యవస్థనూ చక్కగా బోధించవచ్చనీ, ఉన్న వనరులను చక్కగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులకు ఆట పాటలతో పాటు సైన్స్, గణితం, సాంఘీక శాస్త్ర విషయాలలో ప్రయోగాలు చేయించటం వారిని శాస్త్రీయదృక్పథానికి ప్రేరణగా నిలుస్తుందనీ, సులభంగా అర్ధమవ్వటంతో పాటు చక్కగా గుర్తుంచుకోగలుగుతారన్నారు. విద్యార్థులు తయారుచేసుకు వచ్చిన మోడల్స్ పరిశీలించి వారితో వాటి గురించి అడిగి, వారు చక్కని వివరణను ప్రశంసించారు. ఎంఇఓ.2 మల్లానాయక్ మాట్లాడుతూ విద్యార్థులు మంచి లక్ష్యాలు పెట్టుకుని శాస్త్రీయ దృక్పథంతో చదివినట్లయితే మంచి శాస్త్రవేత్తలుగా అవతరిస్తారనీ, పాఠశాల స్థాయిలోనే తల్లిదండ్రులు ఉపాధ్యాయులు చక్కని ప్రోత్సాహం అందించి పిల్లలలో వున్న సృజనాత్మకతను వెలికితీయాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయ నిర్ణేతలుగా జూనియర్ కాలేజీ అధ్యాపకులు వెంకటనారాయణ, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాసరావు వ్యవహరించారు. హరియ నాయక్, శాఖమూరి శ్రీనివాస్, రాంబాబు, శ్యామ్, శివ శంకర్ నాయక్, జ్యోతి తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'క్విస్' కళాశాలలో జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్

- పోటీలో పాల్గొన్న 14 కాలేజీలు
- హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లు
- మొదటిబహుమతి సెంటాన్స్ చీరాల
- రెండో బహుమతి సాధించిన 'క్విస్' కళాశాల

విశాలాంధ్ర -ఒంగోలు : ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలలకు చెందిన 14 జట్లు పోటీల్లో పాల్గొన్నాయని క్విస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీ గాయత్రి దేవి తెలియజేశారు. విద్యతో పాటు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని, క్రీడలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతోనే ఈ పోటీలు నిర్వహించినట్లు తెలియజేశారు. కాగా.. 14 జట్ల మధ్య మొదటి నుంచి పోటీ హోరాహోరీగా సాగింది. ఫైనల్స్‌లో క్విస్ ఇంజనీరింగ్ కళాశాల జట్టు, చీరాల సెయింటాన్స్ ఇంజనీరింగ్ కళాశాల జట్లు పోటీ పడ్డాయి. హోరాహోరీగా గట్టిపోటీ నెలకొన్న ఫైనల్స్‌లో సెయింటాన్స్ జట్టు విజయం సాధించింది. క్విస్ ఇంజనీరింగ్ కళాశాల జట్టు రెండో బహుమతి సాధించగా పేస్ ఇంజనీరింగ్ కళాశాల జట్టు మూడో బహుమతి సాధించినట్లు క్రీడావిభాగం తెలియజేసింది. గెలుపొందిన జట్లకి క్విస్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.వి. హనుమంతరావు ట్రోఫీ, నగదుబహుమతి, ప్రశంసపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన గెలుపొందిన టీమ్‌లకి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో డీన్ అకడమిక్స్ డాక్టర్ సత్యమెహర్, క్రీడావిభాగాధిపతి డాక్టర్ కోటేశ్వరరావు, వివిధ విభాగాల హెచ్ వోడీలు, డీన్‌లు, డైరెక్టర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల స్పోర్ట్స్ డీన్ డాక్టర్ నవనీతకృష్ణన్ పర్యవేక్షించారు.

మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

విశాలాంధ్ర-పెద్ద దోర్నాల : పెద్ద దోర్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించడం జరిగింది. మండల విద్యాశాఖ అధికారి ఎంఈఓ మస్తాన్ నాయక్ రిబ్బ న్ కటింగ్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులు వివిధ విజ్ఞాన శాస్త్ర నమూనాలను ప్రదర్శనకు తీసుకువచ్చి తమ ప్రతిభను ప్రదర్శించారు. మండల విద్యా శాఖాధికారి బి.మస్తాన్ నాయక్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.శ్యాంప్రసన్న తాంజలి, రామచంద్రకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.మహంతు నాయక్, ఇతర ఉపాధ్యాయ బృందం కలిసి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.విద్యార్థులు మొత్తం ఏడు ఉప అంశాలపై ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఉదయం అన్ని ప్రదర్శనలు విద్యార్థుల సందర్శనకు ఏర్పాటు చేయగా, మధ్యాహ్నం న్యాయ నిర్ణేతలు ప్రాజెక్టులను ప్రత్యేకంగా పరిశీలించారు. న్యాయ నిర్ణేతలుగా ఎం. వర్ధన్, సి.హెచ్. కాశీరాములు, జి. శ్యాంసుందర్, కోటపాటి శ్రీనివాసులు వ్యవహరించారు. వారు ప్రతి విద్యార్థి ప్రాజెక్టు వివరాలు సవివరంగా తెలుసుకొని విజేతలను ఎంపిక చేశారు.సాయంత్రం 4 గంటలకు జరిగిన ముగింపు సభలో విజేతలకు సర్టిఫికెట్లు మరియు బహుమతులు అందజేశారు. మొత్తం ఏడు ఉపాంశాల పేరిట ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన 14 మంది విద్యార్థులు బహుమతులు అందుకున్నారు. ప్రథమ స్థానంలో నిలిచిన ఏడుగురు విద్యార్థులు రేపు, డిసెంబర్ 19న ఒంగోలులో నిర్వహించనున్న జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొననున్నారు.ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పెద్ద దోర్నాల -పి. నవీన్,ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల బాలుర పాఠశాల -ఎం. నాగచైతన్య వై. చెర్లోపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల - ఏ. జస్మిత,ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పెద్ద దోర్నాల -సయ్యద్ సాదియా, కె.వర్ష,శ్రీరామచంద్రకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల - డి. సరిత,చిన్న దోర్నాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల - కె. గోపీనాథ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పెద్ద దోర్నాల -పి. కృష్ణతేజలు బహుమతులు అందుకున్నారు.

కోటిసంతకాల పత్రాల ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే కదిరి

విశాలాంధ్ర-సిఎస్ పురం : ప్రభుత్వ మెడికల్ కళాశాలల ను ప్రవేట్ పరం చేస్తున్న చంద్రబాబు ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాష్ట్రంలో సేకరించిన కోటి నాలుగు లక్షల పదిహేడు వేల సంతకాల సేకరించిన ఆపత్రాలను రాష్ట్ర గవర్నర్‌కు సమర్పించే కార్యక్రమంలో భాగంగా గురువారం తాడేపల్లిలోని వైసీపీ కేంద్రకార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల సమన్వయకర్తలు, రీజనల్ కోఆర్డినేటర్లు, పార్లమెంట్ పరశీలకులు, జిల్లాల పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులతో వైయస్ జగన్ మోహన్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో కనిగిరి మాజీ ఎమ్మెల్యే విశాఖపట్నం పార్లమెంట్ పరశీలకులు కదిరి బాబురావు ,జిల్లా పార్టీ అధక్షులు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, జడ్పి చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ ,మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు కూటమి ప్రభుత్వం శుభవార్త

విజయవాడ నుంచి వెళ్లే హాజీలకు రూ.లక్ష ఆర్థిక సాయం

విశాలాంధ్ర-ఒంగోలు : విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం నుండి పవిత్రమైన మక్కా హజ్ యాత్రకు వెళ్లే ప్రయాణికులకు సీఎం నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అందచేస్తున్న ఆర్థిక చేయూతను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర టిడిపి మైనారిటీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పఠాన్ హనీఫ్ ఖాన్ కోరారు. గన్నవరం ఎయిర్ పోర్ట్ నుండి హజ్‌కు వెళ్లే వారందరికీ రూ.లక్ష ఆర్థిక సాయం అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసిందని ఆయన వెల్లడించారు. ఆదాయంతో నిమిత్తం లేకుండా విజయవాడ ఎంబార్కేషన్ నుంచి వెళ్లే యాత్రికులందరికీ మైనారిటీ సంక్షేమ శాఖ రూ.లక్ష సాయం అందిస్తుందన్నారు. ఇతర రాష్ట్రాల ఎంబార్కేషన్ కేంద్రాల నుండి వెళ్లే యాత్రికుల విమాన చార్జీల కంటే ఎక్కువ మొత్తం విజయవాడ నుంచి వెళ్లే వారిపై పడుతున్న భారం తగ్గించేందుకు రూ.లక్ష ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందన్నారు. గన్నవరం విమానాశ్రయం పరిసర జిల్లాల యాత్రికుల సౌకర్యార్థం, ఏపీ రాజధానిగా అమరావతి ప్రాముఖ్యతను మరింత పెంచేందుకు, విజయవాడ నుండి హజ్‌కి వెళ్లే యాత్రికులందరికీ ప్రభుత్వం రూ.లక్ష ఆర్థిక సాయం అందిస్తుందని పేర్కొన్నారు.

రసాయనక మందులు తగ్గించి జీవన ఆధారిత పద్ధతులు ఎంచుకోండి

విశాలాంధ్ర-ముండ్లమూరు : రైతులు పంటలలో రసాయనక ఎరువుల మందులు తగ్గించి జీవన ఆధారిత పద్ధతులు ఎంచు కున్నట్లయితే ఎంతో ఉపయోగమని బాపట్ల వ్యవసాయ కళాశాల(రావేప్) విద్యార్థులు అభిప్రాయం వ్యక్తం చేశారు. మండల కేంద్రమైన ముండ్లమూరులో ఎన్ ఎస్ కే ఈ తయారీపై బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా గ్రామీణ వ్యవసాయ పనితీరులో భాగంగా నేమ్ సీడ్ క ర్నెల్ ఎక్స్ ట్రాక్ట(ఎన్ ఎస్ కే ఈ) తయారీ మరియు వినియోగంపై రైతులకు మెదడ్ డెమో టషన్ నిర్వహించారు. విద్యార్థులు రైతులకు వేపగింజల కర్నెల్ నుంచి ఎన్ ఎస్ కే ఈ తయారు చేసే విధానం, సరైన మోతాదు, పంటలపై పిచికారి చేసే సమయం, జాగ్రత్తల గురించి వివరించారు. వరి, మిరప, మొక్కజొన్న, వంటి పంటలలో కీటక నియంత్రణకు ఎన్ఎస్కే ఈ తక్కువ ఖర్చుతో పర్యావరణ రహితంగా ఎలా ఉపయోగపడుతుందో చూపించారు. రైతులు ఈ ప్రదర్శన ఆసక్తిగా వీక్షించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విద్యార్థులు పి భరత్, పి అర్జున్, ఎస్కే బాజీ, అప్రమేయ, అనుపమ్ రాయ్, రైతులు పాల్గొన్నారు.

'అల్లూరికి అండగా నిలిచిన ఫజుల్లా ఖాన్ - షేక్ మదీనా' పుస్తకం ఆవిష్కరణ

విశాలాంధ్ర-కనిగిరి : కనిగిరి మహిళా డిగ్రీ కళాశాల, ఎమ్.ఎస్. ఆర్.జూనియర్ కాలేజీ, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జడ్పీ బాలికోన్నత పాఠశాల, లైబ్రరీలో గురువారం పుస్తకం ఆవిష్కరణ జరిగింది. పొలిటిక్స్ లెక్చరర్ కాశిరెడ్డి మాట్లాడుతూ ఇది చరిత్రకు గుర్తుగా ప్రతి ఒక్కరు చదవ వలసిన పుస్తకం అన్నారు. కామర్స్ లెక్చరర్ సాయి మాట్లాడుతూ మనకు స్వతంత్ర ఉద్యమం తెలుసు కాని ఎంతో మంది మన స్వేచ్ఛ స్వాతంత్రత కోసం అసువులు బాసారో తెలియచేసే మన్యం వీరుడు అల్లూరి సీత రామరాజుకు అండగా ఫజులుల్లా ఖాన్, షేక్ మదీనాలు కృషి మన ప్రపంచానికి తెలియచేసేలా రాయడం గొప్ప విషయం అన్నారు. ఎమ్.ఎస్.ఆర్.జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ వెంకట రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువ వలసిన పుస్తకమని రచయిత నసీర్ అహమ్మద్‌కు ధన్యవాదములు తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్.ఎమ్. సంజీవయ్య మాట్లాడుతూ ఇలాంటి పుస్తకం రాయడం వలన మరిచి పోయిన వ్యక్తులను, మహనీయులను అల్లూరి సీత రామరాజును గుర్తు చేసుకోవడం శుభ పరిణామమని రచయితకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చరిత్ర అధ్యాపకులు స్వర్ణ బాబు, రాజా,మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రముఖ చరిత్రకారుడు సయ్యద్ నశీర్ అహమ్మద్ అహ్మద్ రచించి వెలువరించిన నూతన పరిశోధనాత్మక పుస్తకం 'అల్లూరికి అండగా నిలిచిన ఫజుల్లా ఖాన్ - షేక్ మదీనా' రెండు తెలుగు రాష్ట్రాలలో డిసెంబర్ 17న సుమారు వంద చోట్ల విడుదల అయ్యింది. సయ్యద్ నశీర్ అహమ్మద్ రచించి ప్రచురించిన "మహాత్మా గాంధీ ముస్లిం సహచరులు మరియు అనుచరులు, పండిత్ రామప్రసాద్ బిస్మిల్ - అష్ఫాఖుల్లా ఖాన్, ఆధునిక భారతదేశం మొదటి ముస్లిం ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్, మహాత్మా గాంధీ ప్రాణ రక్షకుడు బతాక్ మియా అన్సారీ" పుస్తకాలు కూడా భారతదేశంలోని పలు రాష్ట్రాలలో వందలాది చోట్ల గతంలో ఆవిష్కరించబడ్డాయి.

బంగారం ఆన్‌లైన్ కొనుగోలు అమ్మకాల నియంత్రణపై మాగుంట ప్రశ్న

విశాలాంధ్ర-ఒంగోలు : దేశం మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో డిజిటల్ బంగారం ఆన్ లైన్‌లో దేశం, విదేశాల్లో కొనుగోలు, అమ్మకాలు జరుపుటకు నమోదయిన సంస్థలు, గత 5 సంవత్సరాలలో భారతీయులు కొన్న బంగారం విలువ, మొత్తం ఫిర్యాదులు, అవగాహన కార్యక్రమాల గురించి ప్రస్తుత పార్లమెంటు సమావేశాలలో ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నించారు. దీనికి కేంద్ర ఆర్థిక శాఖ సహాయక మంత్రి, పంకజ్ చౌదరీ సమాధానమిస్తూ దేశం, విదేశాలలో డిజిటల్ బంగారం ఆన్ లైన్‌లో కొనుగోలు మరియు అమ్మకాలు జరిపి సంస్థలను నమోదు చేయబడలేదని, 2020 నుండి 2025 వరకు జాతీయ వినియోగదారుల హెల్ప్ లైన్ (టెలిఫోన్ సేవ) ద్వారా వచ్చిన డిజిటల్ బంగారానికి సంబంధించి దేశం మొత్తంలో వినియోగదారుల నుండి 371 పిర్యాదులు రాగా, ఆంధ్రప్రదేశ్ నుండి 17 వచ్చాయని తెలిపారు.

గ్రామాల్లో మౌలిక వసతులకు ప్రభుత్వం కృషి

డీపీఓ ఎం.వెంకటేశ్వరరావు

విశాలాంధ్ర-పామూరు : పారిశుధ్యమును మెరుగుపరుచుట, స్వచ్ఛమైన నీరు అందించుట, మొదలగు వసతులను కల్పించుటకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని జిల్లా పంచాయతీ అధికారి ఎం.ఎంకటేశ్వరరావు అన్నారు. గురువారం మండలంలోని కోడిగుంపల గ్రామాన్ని అధికారులు ప్రజా ప్రతినిధులతో కలిసి సందర్శించారు. ప్రతి 15 రోజులకు ఒకసారి మంచినీటి ట్యాంకులు శుభ్రపరచాలి. ట్యాంకులను పూర్తిగా నీటితో నింపి తప్పనిసరిగా క్లోరినేషన్ చేయాలి.నీటి నమూనాలను పరీక్షించి ఎలాంటి కలుషితం లేకుండా నిర్ధారించాలి. బోర్ల నీటి నమూనాలను ఇంజనీరింగ్ అసిస్టెంట్ సహాయంతో ప్రజల సమక్షంలో పరీక్షించాలి. గ్రామ ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించడంలో బాధ్యతాయుతంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు గ్రామ శుభ్రత కొరకు చెత్త, పేడ దిబ్బలు ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు.సైడ్ కాలువలను తరచుగా శుభ్రం చేయాలన్నారు. స్వచ్ఛత గ్రామాలకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య, డిప్యూటీఎంపీడీవో కె.సుందర రామయ్య, ఇంజనీరింగ్ అసిస్టెంట్, ఏఎన్ఎం పాల్గొన్నారు.

నూతన ఆలోచనలకు పదునుపెట్టాలి

విశాలాంధ్ర-కురిచేడు : వైఆర్‌జెడ్‌పి ఉన్నత పాఠశాల యందు గురువారం మండల స్థాయి విజ్ఞాన శాస్త్ర ప్రదర్శన ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుల క్లస్టర్ హెడ్మాస్టర్ టీవీ సుబ్బారావు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీడీవో సత్య వరప్రసాద్, ఎంఈఓ. ఆర్ వస్త్రం నాయక్, జడ్పిటిసి ఎస్. వెంకట నాగిరెడ్డి, విజ్ఞాన శాస్త్ర ఉపాధ్యాయులు యూటీఫ్ మండల శాఖ బాధ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు వారి వెంట తెచ్చిన వివిధ విజ్ఞాన శాస్త్ర మోడల్స్‌ను అందరూ కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ ఆర్ వస్త్రం నాయక్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలో ఏదో ఒక కొత్త ఆలోచన విధానమును స్ఫూర్తిగా ఉంటుందని దానిని క్రమమైన మార్గములో పదును పెట్టాల్సిన అవసరము ఉపాధ్యాయులపై ఉంటుందన్నారు. పాఠశాల స్థాయిలో విద్యార్థులను వినూత్నంగా ఆలోచింపజేయాలని ఎక్కువ విద్యార్థులు సమస్యలు అడిగే ఆలోచన దోరణిని పెంపొందించాలన్నారు. 7 థీమ్స్‌లలో మొదటి స్థానంలో వచ్చిన ప్రదర్శనలు రేపు జిల్లా స్థాయిలో జరిగే ప్రదర్శనకు పంపటం జరుగుతుంది.

ఎరువుల దుకాణాలు తనిఖీ

విశాలాంధ్ర - అద్దంకి : అద్దంకిలో గురువారం మార్టూరు ఏడిఏ సుదర్శన రాజు ఆధ్వర్యంలో స్క్వాడ్ ఎరువుల దుకాణాలను తనిఖీలు చేశారు. ఏడిఏ మాట్లాడుతూ ఈ పాస్ మిషన్లో వాస్తవ నిల్వలు సరిచూసుకోవాలని దుకాణదారులకు సూచించారు. రైతులకు అమ్మిన ప్రతి ఎరువు బస్తాను ఈ పోస్ మిషన్లో నమోదు చేయాలని లేకపోతే కేంద్ర ప్రభుత్వం నుండి ఎరువులు జిల్లాకు రావని తెలిపారు. తనిఖీలో అద్దంకి, కొరిసపాడు మండలాల వ్యవసాయ శాఖ అధికారులు వెంకటకృష్ణ రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

విశాలాంధ్ర
బాపట్ల జిల్లా

ముగిసిన మాలధారుల 41 రోజుల చద్ది

విశాలాంధ్ర - చెరుకుపల్లి : శ్రీ ధర్మశాస్త సేవా సంఘం చెరుకుపల్లి వారి ఆధ్వర్యంలో స్థానిక రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో గత నెల 16వ తేదీ నుండి ప్రారంభమైన చద్ది కార్యక్రమం గురువారంతో ముగిసింది. దాతల సహాయ సహకారాలతో మాల ధరించిన స్వాములకు భోజనాన్ని చద్దిగా అందించిన నిర్వాహకులకు స్వాముల నుండి అభినందనలు ధన్యవాదాలు అందుతున్నాయి. గురువారం ఉదయం దేవస్థానం ప్రాంగణంలో సంఘం అధ్యక్షులు కందుల వెంకటేశ్వరరావు దంపతులచే గణపతి హెూమం, పూర్ణాహుతి కార్యక్రమాలను వేద పండితులు నిర్వహించారు. ఈ కార్యక్రమ నిర్వహణకు సహకరించిన దాతలకు నిర్వహించిన ధర్మశాస్త్ర అయ్యప్ప సేవా సంఘం సభ్యులకు గ్రామస్తుల నుండి అభినందనలు అందాయి.

ప్రజా ఆమోదంతో బాపట్ల అభివృద్ధి

మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్

విశాలాంధ్ర - బాపట్ల : బాపట్లను ప్రజా ఆమోదంతో అభివృద్ధి చేయాలని మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ చెప్పారు. గురువారం బాపట్ల పట్టణంలోని వివిధ సమస్యలపై మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రాలు అందించారు. పట్టణంలో మాస్టర్ ప్లాన్‌పై తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకుని శిఖరం వారి వీధిని మాస్టర్ ప్లాన్‌లో చేర్చకపోవడంతో జరిగే నష్టాన్ని వివరించారు. పర్యాటక రంగం విస్తృతంగా అభివృద్ధి చెందుతున్న వేళ పాండురంగాపురం సముద్రతరానికి ప్రధాన రహదారిగా శిఖరం వారివీధి నిలుస్తుందని అటువంటి రహదారిని మాస్టర్ ప్లాన్‌లో చేర్చి సూర్యలంక రహదారికి దీటుగా తీర్చిదిద్దాలని విజ్ఞప్తి చేశారు. మాస్టర్ ప్లాన్ పై ఇప్పటివరకు 14 అర్జీలు వచ్చాయని వాటిని సానుకూలంగా పరిష్కరించాలన్నారు. అభివృద్ధి చేసే విషయంలో ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకుండా ప్రజలను సంప్రదించి సమావేశాలు నిర్వహించి ముందుకు సాగాలని కోరారు.

- విగ్రహాలను తిరిగి ఏర్పాటు చేయాలి

బాపట్ల పట్టణంలో రహదారుల వెడల్పు కార్యక్రమంలో భాగంగా తొలగించిన విగ్రహాలను తిరిగి యథాస్థానంలో ప్రతిష్టించాలని కమీషనర్‌ను కోరారు. పట్టణంలో ఏర్పాటు చేసిన విగ్రహాలను రాజకీయ నేతలుగా చూడకుండా వారికి ఉన్న ప్రజాధరణను దృష్టిలో ఉంచుకొని తిరిగి ఏర్పాటు చేయాలన్నారు. పట్టణంలో రోడ్డు విస్తరణలో అప్పటి కమిషనర్ విగ్రహాలు అదే స్థానంలో ఏర్పాటు చేస్తామని ముందుగానే ప్రకటించి వాటిని తొలగించడం జరిగిందని ప్రస్తుత కమిషనర్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అధికారులు ఏకపక్ష ధోరణికి విముక్తి పలకాలని గత ప్రభుత్వ హయాంలో పట్టణంలోని వివిధ సర్కిల్‌లకు వివిధ నామ కారణాలు చేస్తూ రూపొందించిన గెజిట్‌ను రద్దుపరిచి ఏకపక్ష ధోరణికి స్వస్తి పలకాలని చెప్పారు.బాపట్ల పట్టణంలో తొలగించిన విగ్రహాలను మునిసిపల్ అధికారులు మున్సిపల్ కార్యాలయం వద్ద చెత్త ట్రాక్టర్లు నిలిపే ప్రదేశంలో ఉంచడంపై అన్నం సతీష్ ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల ఆమోదంతోనే అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగించాలని లేనిపక్షంలో పోరాటాలు చేయడానికి సిద్ధమని హెచ్చరించారు. యార్లగడ్డ లక్ష్మీనారాయణ, కొండారెడ్డి అనిల్ కుమార్, కొ్ట్ర రామకృష్ణ, బుర్ల రత్తయ్య, మామిడి రమేష్ పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ విరమించుకోవాలి

❑ జివో 590, 107 108లు రద్దు చేయాలి

❑ సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పరుచూరి రాజేంద్ర బాబు

విశాలాంధ్ర - బాపట్ల : పిపిపి విధానంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ విరమించుకోవాలని జీవో నెం 590, 107 108లు రద్దు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పరుచూరి రాజేంద్ర బాబు డిమాండ్ చేశారు.ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణను నిరసిస్తూ సిపిఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ బాపట్ల జిల్లా సమితి ఆధ్వర్యంలో బాపట్లలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సర్కిల్ నందు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పరుచూరి రాజేంద్రబాబు మాట్లాడుతూ ప్రభుత్వ నూతన వైద్య కళాశాలల్లో పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్షిప్ (పిపిపి) విధానాన్ని అమలు చేయాలని చంద్రబాబు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అత్యంత ప్రమాదకరమైనదన్నారు. రాష్ట్రంలోని పది నూతన ప్రభుత్వ వైద్య కళాశాలలను పిపిపి విధానంలో ప్రైవేటీకరించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం జీవో నంబర్ 590ని జారీ చేయడం సరికాదన్నారు. సెప్టెంబర్ 9న రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం 590 విడుదల చేయడం ద్వారా మార్కాపురం, మదనపల్లి, ఆదోని, పులివెందుల, పెనుగొండ, పాలకొల్లు, అమలాపురం, నర్సీపట్నం, బాపట్ల, పార్వతీపురం ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన నూతన ప్రభుత్వ వైద్య కళాశాలలను పిపిపి పరిధిలోకి తీసుకురావడం దుర్మార్గమన్నారు.ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అభిప్రాయాన్ని గౌరవించి జీవో నెం 590 తక్షణమే ఉపసంహరించాలని గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోలు 107, 108లను రద్దుచేయాలని నూతన వైద్య కళాశాలలను పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోనే నిర్మించి, నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయుసి జిల్లా కార్యదర్శి బత్తుల శామ్యూల్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి బిజిలి బాబు, సిపిఐ సీనియర్ నాయకులు ముత్తిరెడ్డి నాగేశ్వరరావు, డిహెచ్పిఎస్ నాయకులు నాగేశ్వరరావు, ముత్తిరెడ్డి శ్రీనివాసులు, కరిముల్లా, తదితరులు పాల్గొన్నారు.

ఆస్తికి శాశ్వత హక్కు కల్పించడమే 'స్వామిత్వ సర్వే'

విశాలాంధ్ర - సంతమాగులూరు : పూర్వీకుల ద్వారా వారసత్వంగా సంక్రమించే ఆస్తికి చట్టబద్ధత కల్పించి, శాశ్వత పత్రాలతో వారసులకు అందించే విధంగా స్వామిత్వ సర్వే దోహదపడుతుందని ఎంపీడీవో జ్యోతిర్మయి తెలిపారు. గురువారం స్వామిత్వ సర్వేపై ఏల్చూరు, పాతమాగులూరు, సంతమాగులూరు పంచాయతీల్లో సర్పంచులు జిర్రా విజయబాబు, మందా సూరిబాబు, పుచ్చకాయల నాగేశ్వరరావు అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు. ఎంపీడీవోతో పాటు డిప్యూటీ ఎంపీడీవో శివరామకృష్ణ ప్రసాద్ అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ సర్వే ద్వారా వారసత్వపు ఆస్తిని హక్కుదారులకు శాశ్వత ప్రాతిపదికన కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని పేర్కొన్నారు. అనంతరం ప్రజలకు స్వమిత్వ సర్వే పట్ల ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. ఈకార్యక్రమంలో జనసేన ఉమ్మడి ప్రకాశం జిల్లా కార్యదర్శి చల్లా వెంకటకృష్ణారావు, మండల టీడీపీ నేత దుద్దేల చిన్న గాలయ్య తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్‌ల్లో ఎమ్మార్వో తనిఖీ

విశాలాంధ్ర - ఇంకొల్లు : మండలంలోని దుద్దుకూరు గ్రామంలో ఉన్న ఆచార్య రంగా జిల్లా పరిషత్ హైస్కూల్లో గురువారం ఎమ్మార్వో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. వందరోజుల యాక్షన్ ప్లాన్ గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అలాగే విద్యార్థులు సాయంత్రం నాలుగు గంటల నుంచి ఐదు గంటల వరకు ప్రతిరోజు పరీక్షలు నిర్వహిస్తున్నారని తెలియజేశారు. నిర్వహించిన పరీక్ష ఫలితాలను లీప్ యాప్‌లో అప్లోడ్ చేస్తున్నామని ఉపాధ్యాయులు తెలిపారు. రోజు పరీక్షలు నిర్వహించడంతో స్ట్రీమ్ లైన్‌లో ఉన్న విద్యార్థులు స్కైస్టార్స్ లెవెల్‌కి ఎదుగుతారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో నిషి ప్రతిభ

విశాలాంధ్ర - పర్చూరు : జాతీయ వినియోగదారుల దినోత్సవంను పురస్కరించుకొని జిల్లా స్థాయిలో విద్యాశాఖ వారు బాపట్లలో ఉన్నత పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులకు డిజిటల్ న్యాయవ్యవస్థ ద్వారా సమర్థవంతమైన, వేగవంతమైన పరిష్కారం అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో మండలంలోని ఉప్పుటూరుజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థిని కందుల నిషి జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిందని జిల్లా సైన్స్ అధికారి సాధిక్ ప్రకటించారు. విజేతను స్థానిక పర్చూరు మండల విద్యాశాఖ అధికారులు శివ కోటేశ్వరరావు, వెంకట్రామయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుని వసుంధరదేవి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ , హెూమియో వైద్యులు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు రామకోటిరెడ్డి, వెంకటస్వామి తదితరులు అభినందించారు. 23వ తేదీ విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలో నిషి పాల్గొనున్నట్లు తెలిపారు.

ఆర్థిక క్రమశిక్షణపై అవగాహన

విశాలాంధ్ర -అద్దంకి : పొదుపు సంఘాల సభ్యులు చెల్లించే ఆర్థిక లావాదేవీలు పట్ల క్రమశిక్షణ ఉండేలా చూడాలని ఏపీఎం జ్యోతి ప్రసాద్ బాబు అన్నారు. స్థానిక మండల వెలుగు కార్యాలయంలో గురువారం అద్దంకి, జనకవరం పంగులూరు మండలాలకు చెందిన గ్రామ సంఘ సహాయకులకు మన డబ్బులు - మన లెక్కలు, లోకోస్, ఎం బి కె 2.0 కార్యక్రమాలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏ పీ ఎం జ్యోతి ప్రసాద్ మాట్లాడు తూ సంఘం సమావేశాలకు సంబంధించిన జియో టాగింగ్ ప్రకారం ఆయా ప్రదేశాలలో నిర్వహించడం ప్రధానమన్నారు. ప్రతి మహిళ ముఖ చిత్రం ఆధారంగా అటెండన్స్ తీసుకొని లావా దేవీలు చేపట్టాలని తెలిపారు. మహిళలు పొందే అన్ని రకాల రుణాలు, తిరిగి చెల్లింపు వివరాలు పారదర్శకంగా నమోదు చేయాలని సూచించారు. అనంతరం లీగల్ కో ఆర్డినేటర్ విజయభాస్కర్ మన డబ్బులు - మన లెక్కలు , లోకోస్ యాప్ ల నిర్వహణ పట్ల శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జె పంగులూరు ఏ పి ఎం చవలం కోటేశ్వరరావు, ఆయా మండలాల సీసీ లు విజయరాణి, బ్రహ్మయ్య, వెంకయ్య, యేసయ్య, అకౌంటెంట్ లు శ్యామల, అనూష, గ్రామ సంఘ సహాయకులు పాల్గొన్నారు.

పూనూరు హోమియో వైద్యశాల నిర్మాణానికి నిధులు మంజూరు

విశాలాంధ్ర - యద్దనపూడి : మండలంలోని పూనూరు గ్రామంలో ఉన్న హెూమియో వైద్య చాలా శిథిలావస్థకు చేరడంతో ,గ్రామ టిడిపి నాయకులు రాటకొండ వరద బాబు, బత్తుల రాము, వంకాయలపాటి సుబ్బారావు లు, హెూమియో వైద్యశాల గురించి పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు దృష్టికి తీసుకు పోగా, స్పందించిన ఆయన అధికారులతో మాట్లాడి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ,వైద్య, మౌలిక వసతులు బలోపేతం చేసేందుకు ,3.82 కోట్లతో హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్ భవనాల నిర్మాణానికి టెండర్లు పిలవటం జరిగింది. వాటిలో పూనూరు గ్రామంలో హెూమియో వైద్యశాలకు 36 లక్షల నిధులు మంజూరైనట్లు గ్రామ టిడిపి నాయకులు తెలిపారు. గ్రామములోని వైద్యశాలకు నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే ఏలూరి కి రాటకొండ వరదబాబు, బత్తుల రాము, వంకాయలపాటి సుబ్బారావు, దరువురి వీరయ్య చౌదరి, రాటకొండ కోటేశ్వరరావు, గుమ్మడి సుదీర్, తాళ్లూరి సాంబశివరావు, పెండ్యాల వీరబ్రహ్మం, కోటగిరి రామకృష్ణ, పావులూరి బాబు, పాలపర్తి వీరాస్వామి,లు నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే ఏలూరికి కృతజ్ఞతలు తెలిపారు.

21న మార్టూరులో మెగా రక్తదాన శిబిరం

విశాలాంధ్ర - మార్టూరు : రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా మార్టూరులో ఈనెల 21వ తేదీ ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు పర్చూరు వైస్సార్సీపీ కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పర్చూరు నియోజకవర్గ వైఎస్ ఆర్సిపి ఇంచార్జ్ గాదె మధుసూదనరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ఇంటూరి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నారు. ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

వీధి కుక్క దాడిలో విద్యార్థులకు తీవ్ర గాయాలు

◆ 8 మంది స్కూల్ విద్యార్థులకు తీవ్ర గాయాలు

◆ పట్టించుకోని మున్సిపల్ అధికారులు

◆ వీధి కుక్కలను కట్టడి చేయాలనీ తల్లిదండ్రులు ఆందోళన

విశాలాంధ్ర - రేపల్లె : పట్టణంలోని ఎనిమిదో వార్డులో స్కూల్ కి వెళ్తున్న విద్యార్థులపై వీధి కుక్క దాడి చేసిన ఘటనలో 8 మంది విద్యార్థులకు తీవ్ర గాయాలు అయిన సంఘటన గురువారం పట్టణంలో జరిగింది. గాయపడిన విద్యార్థులను ఇరుగు పొరుగువారు గుమగుడి కుక్కలను చెదరగొట్టి వెంటనే రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆసుపత్రిలో వైద్యులు, వైద్య సిబ్బంది 8 మందికి వాక్సిన్ ప్రాథమిక చికిత్స ఇంజక్షన్లు నర్సులు అందించారు. గాయపడిన చిన్నారులకు వైద్యుల పర్యవేక్షణలో వైద్యం అందించటం జరిగింది. మిగతా వాక్సిన్ తేదీలు తెలిపి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి విద్యార్థులకు ప్రభుత్వ ఆసుపత్రి నర్సులు డాక్టర్లు తగు సూచనలు చేశారు. గాయపడిన విద్యార్థులు అజిత్ కుమార్, రోహిత్, హర్ష రుచిత, పూజిత, సాయి, చరణ్, నాగబాబు ఉన్నారు. విషయం తెలుసుకుని చిన్నారుల తల్లి దండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తూ వైద్యశాలకు చేరుకున్నారు వారి చిన్నారుల గాయాలను చూసి వీధి కుక్కలను కట్టడి చేయాలని గతములో పలుమార్లు మున్సిపల్ అధికారులు దృష్టికి తీసుకువెళ్లామని స్పందించకపోవడం, పోనీ వీధి కుక్కల దాడులకు మా చిన్నారులు బలయ్యారని చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు.

పార్టీలకు అతీతంగా ఆపన్నహస్తం

ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

విశాలాంధ్ర - బాపట్ల : బాపట్ల నియోజకవర్గ ప్రజల భద్రత భరోసా నా బాధ్యత అని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. పార్టీ కార్యాలయంలో గురువారం సీఎం సహాయ నిధి చెక్కులను బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీలకు కులమతాలకు అతీతంగా ఆపదలో ఉన్న వారికి సాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఏ పార్టీ వారైన ఆపద ఉంటే నేరుగా నన్ను కలవవచ్చు అన్నారు. తాను రాజకీయాల్లోకి వచ్చిందే సేవ చేసేందుకు అని పౌండేషన్ ద్వారా దశాబ్దకాలంపైనే సేవ కార్యక్రమాలు చేస్తున్నానని ప్రస్తుతం ఎమ్మెల్యేగా సేవను విస్తృతం చేస్తున్నానని చెప్పారు. నాపై నమ్మకంతో నన్ను ఎమ్మెల్యేగా చేసిన ప్రజల కోసం నిరంతరం తనవంతుగా ప్రజల అభ్యున్నతి కోసం కృషి చేస్తానని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా మానవీయ దృక్పథంతో ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించి, ప్రతి కుటుంబానికి ప్రభుత్వాన్ని అండగా నిలిపేలా నిరంతరం శ్రమిస్తున్నట్లు తెలిపారు. అనారోగ్యం వంటి అత్యవసర పరిస్థితుల్లో సీఎం సహాయ నిధి ద్వారా తక్షణ సహాయం అందించి కుటుంబాలకు భరోసా కల్పిస్తున్నామన్నారు. అధికారంలోకి వచ్చిన కేవలం కొన్ని నెలల్లోనే బాపట్ల నియోజకవర్గంలో రూ.5 కోట్లకుపైగా నిధుల సహాయ నిధిద్వారా చెక్కులు పంపిణీ చేసి, వేలాది పేద కుటుంబాలకు ఆసరాగా నిలిచామన్నారు. బాపట్ల రూరల్ మండలంలో రూ.1 కోటి 72 లక్షల 85 వేలు, బాపట్ల పట్టణంలో రూ.1 కోటి 18 లక్షల 67 వేలు, కర్లపాలెం మండలంలో రూ.1 కోటి 49 లక్షల 7 వేలు, పిట్టలవానిపాలెం మండలం: రూ.69 లక్షల 85 వేలు పంపిణీ చేశామన్నారు. ప్రతి దరఖాస్తుని వ్యక్తిగతంగా పరిశీలించి సాయం అందేలా ఎల్లవేళలా అండగా నిలుస్తామన్నారు.

అంగన్‌వాడీలకు మొబైల్ ఫోన్‌లు అందజేత

అంగన్వాడీ సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన నూతన శామ్సంగ్ 5జి మొబైల్ ఫోన్లను బాపట్ల పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాల యంలో ఎమ్మెల్యే చేతులమీదగా అంగన్‌వాడీ సిబ్బందికి అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న ఈ మొబైల్ ఫోన్లను సద్వినియోగం చేసుకుని అంగన్వాడి కేంద్రాల ద్వారా అందించే సేవలను మరింత సమర్థవంతంగా , సులభతరంగా ప్రజలకు చేరవేయాలని అంగన్వాడీ సిబ్బందికి ఎమ్మెల్యే సూచించారు.గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు మరింత వేగవంతమైన, నాణ్యమైన సేవలు అందించేందుకు అంగన్వాడి కార్యకర్తలకు అత్యాధునిక 5జి మొబైల్ ఫోన్లను ప్రభుత్వం అందిస్తోందన్నారు. గత ప్రభుత్వం పంపిణీ చేసిన 4జి ఫోన్లు సరిగా పనిచేయకపోవడంతో, సేవల ప్రావీణ్యం తగ్గకుండా ఉండేలా 5జి నెట్‌వర్క్ ఫోన్లను అందించే కార్యక్రమాన్ని ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రారంభించిందని ఎమ్మెల్యే తెలిపారు.

మిస్ ఆంధ్ర రన్నర్‌గా కోమల సాయి

విశాలాంధ్ర - బాపట్ల : మిస్ ఆంధ్రప్రదేశ్ 2025 రన్నర్‌గా బాపట్ల యువతి కోమల సాయి వదాలశెట్టి నిలిచారు. విజయవాడలో జరిగిన ప్రతిష్టాత్మకమైన మిస్ ఆంధ్రప్రదేశ్ 2025 అందాల పోటీలలో బాపట్ల పట్టణానికి చెందిన యువతి ప్రస్తుత అమలాపురం మున్సిపల్ కమీషనర్ నిర్మల్ కుమార్ కుమార్తె వదాలశెట్టి కోమల సాయి సత్తా చాటారు. అద్భుతమైన ప్రతిభ, ఆత్మవిశ్వాసం, వాక్చాతుర్యంతో న్యాయమూర్తులను, ప్రేక్షకులను కోమల సాయి ఆకట్టుకున్నారు. ఎస్ఎస్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన ఈ పోటీలలో రాష్ట్రవ్యాప్తంగా 25 మందికి పైగా పోటీదారులు పాల్గొన్నారు. ఫ్యాషన్, సంస్కృతి, ప్రతిభ వంటి పలు రౌండ్లలో జరిగిన తీవ్రమైన పోటీలో కోమల తనదైన శైలిలో రాణించారు. ముఖ్యంగా ప్రశ్న-జవాబు రౌండ్‌లో ఆమె ప్రదర్శించిన పరిణతి, సామాజిక బాధ్యతపై ఆమెకున్న అవగాహన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కోమల సాయి స్వస్థలం బాపట్ల పట్టణంలో భీమావారిపాలెం తండ్రి గతంలో బాపట్ల మున్సిపల్ కమీషనర్‌గా పనిచేసి ప్రస్తుతం అమలాపురం మున్సిపల్ కమీషనర్‌గా పనిచేస్తున్నారు. ఆమె విజయం స్థానిక యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.పలువురు ప్రముఖులు అభినందించారు.

స్వామిత్వ సభలో పీపీఎంలు అందజేత

విశాలాంధ్ర - జె.పంగులూరు : మండలంలోని బూదవాడ గ్రామ పంచాయితీ, చిన్నమల్లవరం గ్రామపంచాయతీలలో గురువారం ఎంపీడీఓ కె.స్వరూపరాణి అధ్యక్షతన స్వామిత్వ గ్రామసభలు నిర్వహించారు. ఈ సభలో లబ్ధిదారులకు వారి యొక్క సరిహద్దులు, విస్తీర్ణంకు సంబంధించి పీపీఎం (ప్రాపర్టీ పార్సిల్ మెజర్మెంట్స్)లు అందచేసి స్వామిత్వ యొక్క ప్రాముఖ్యత గ్రామ ప్రజలకు వివరించారు. డిప్యూటీ ఎంపీడీవో కే సుమంత్, గ్రామ సర్పంచులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

దేవస్థాన భూములను తహసీల్దార్ పరిశీలన

విశాలాంధ్ర - నిజాంపట్నం : మండల పరిధిలోని దేవస్థాన భూములు ఆక్రమణకు గురయ్యాయన్న ఫిర్యాదుల మేరకు దేవాదాయ శాఖ అధికారులు తహసీల్దార్ మోర్ల శ్రీనివాస రావును ఆశ్రయించారు.ఈ నేపథ్యంలో గురువారం ఆయన నిజాంపట్నం, గోకర్ణమఠం గ్రామాల్లోని శివాలయాలకు చెందిన దేవస్థాన భూములను క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించారు.దేవస్థానాలకు చెందిన భూములను గుర్తించి సర్వే నిర్వహించి, సంబంధిత రికార్డులను ధృవీకరించిన అనంతరం దేవాదాయ (ఎండోమెంట్స్) అధికారులకు అధికారికంగా అప్పగించారు.దేవస్థాన ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని, భవిష్యత్తులో ఎలాంటి ఆక్రమణలకు అవకాశం లేకుండా తగిన చర్యలు చేపడతామని తహసీల్దార్ స్పష్టం చేశారు. దేవస్థాన కార్యనిర్వహణ అధికారి తులసీదాస్, వీఆర్వోలు శామ్యూల్ జాన్, సర్వేయర్, పూజారి శర్మలు పాల్గొన్నారు.

పల్స్ పోలియో విజయవంతం చేయాలి

డాక్టర్ సంగెపు వెంకటలక్ష్మి

విశాలాంధ్ర - అమతలూరు : అమృతలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు గురువారంనాడు 21వ తేదీ ఆదివారం జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల వైద్యాధికారిణి డాక్టర్ సంగెపు వెంకటలక్ష్మి అన్నారు. ఐదు సంవత్సరంలో పిల్లలందరికీ పోలియో చుక్కలు తప్పక వేయించాలి అనే నినాదములతో గ్రామ వీధులలో ర్యాలీ నిర్వహించడం జరిగినది.ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి కొన్ని శ్రీనివాసరెడ్డి ఆరోగ్య పర్యవేక్షకులు పుట్టగుంట శ్రీనివాసరావు, ఎంఎల్‌హెచ్‌పిలు, హెల్త్ అసిస్టెంట్ మేకాశంకర ప్రసాద్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బధిరుల పాఠశాలలో మౌనిక జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - పర్చూరు : రోటరీ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ కుమార్తె మౌనిక జన్మదినాన్ని పురస్కరించుకొని మండలంలోని నాగులపాలెం బధిరుల పాఠశాలలో గురువారం కేక్ కట్ చేసి ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులకు రూ .17,000 విలువైన ఆటవస్తువులు బహుకరించారు. విద్యార్థులకు విందు భోజనం ఏర్పాటు చేశారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి సహాయ సహకారాలను భవిష్యత్తులో అందిస్తానని కృష్ణమోహన్ తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి కోమటి ఆంజనేయులు ,కోశాధికారి పంబి సదానంద రెడ్డి, అసిస్టెంట్ గవర్నర్ నాగబైరు శ్రీనివాసరావు ,సభ్యులు నాగుబడి సుబ్బారావు , రావి సత్యనారాయణ,పోలిశెట్టి చంద్రశేఖర రావు, పాబోలువెంకటేశ్వర్లు ,భవనం రాజ గోపాల్ రెడ్డి ,కోదూరి సుబ్రహ్మణ్య చారి, తేళ్ల రమేష్ చంద్ర,లక్కింశెట్టి లక్ష్మణరావు, దోప్పల పూడి శేషుబాబు ,కొల్లా సుబ్బారావు ,పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు మార్టూరులో విశ్రాంత ఉద్యోగుల సమావేశం

విశాలాంధ్ర - మార్టూరు : జాతీయ పెన్షనర్స్ డే సందర్భంగా మార్టూరు లో ఈనెల 20వ తేదీ శనివారం ఉదయం 9 గంటలకు మార్టూరులో విశ్రాంత ఉద్యోగుల సమావేశం నిర్వహించనున్నట్లు సంఘం మార్టూరు యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు కొరిటాల రామారావు, ఎం. ఎస్.చిట్టిబాబులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల కార్యాలయంలో నిర్వహించను న్న సమావేశంలో రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు పాల్గొని పెన్షనర్ల సమస్యలపై చర్చిస్తారని వారు తెలిపారు.80 సంవత్సరాలు నిండిన విశ్రాంత ఉద్యోగులకు సన్మానం చేయనున్నట్లు, శనివారం ఉదయం అల్పాహారం మధ్యాహ్నం భోజన వసతి ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. మార్టూరు యూనిట్‌కు సంబంధించిన విశ్రాంత ఉద్యోగులు హాజరై సమావేశాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు.

కంభం ఎస్సైగా శివకృష్ణ రెడ్డి

విశాలాంధ్ర-కంభం : కంభం ఎస్సై ఒంగోలుకు విఆర్ బదిలీపై వెళ్లడంతో ఒంగోలులో ఉంటున్న ఎస్ఐ శివ కృష్ణ రెడ్డి బుధవారం కంభంలో భాద్యతలు చేపట్టారు. సందర్భంగా ఎస్ఐ కంభంలో శాంతి భద్రతలు భంగం కలగాకుండా ట్రాఫిక్ సమస్యలు కట్టుదిట్టంచేస్తానని పేర్కొన్నారు.

సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - నిజాంపట్నం : మండలంలోని అడవులదీవి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ ఎగ్జిబిషన్‌లో మండలంలోని 8 ప్రభుత్వ పాఠశాలల నుంచి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని మొత్తం 40 సైన్స్ ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా ఎంఈఓలు ఆర్.శోభా చంద్, జి.శేషు గోపాలం హాజరై విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ప్రదర్శనలను ఆసక్తిగా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులను అభినందిస్తూ, పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా ప్రాయోగిక విజ్ఞానాన్ని అలవర్చుకోవడం ద్వారా భవిష్యత్తులో శాస్త్ర, సాంకేతిక రంగాల్లో మెరుగైన అవకాశాలు సాధించవచ్చని సూచించారు. అనంతరం సైన్స్ ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎంఈఓలు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎన్.వి.సాంబశివరావు, మండల సైన్స్ కోఆర్డినేటర్ పి.వి.శ్రీనివాసరావు, సైన్స్ ఉపాధ్యాయులు పి.కుమారస్వామి, కె.బాబురావు, కె.కళ్యాణి, వై.సురేష్, షేక్ రేష్మ, గణిత ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, మోర్ల బాబురావు, ఎం.భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాపయ్యకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం

విశాలాంధ్ర - నిజాంపట్నం : విద్యారంగంలో విశేష సేవలు అందిస్తున్న నిజాంపట్నం ఎక్స్ సర్వీస్మెన్ కాలనీ ఎంపీయూపీఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు చుక్కా బాపయ్యకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం లభించింది. ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్) ఆధ్వర్యంలో గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. నాట్స్ చైర్మన్ పెన్నమనేని ప్రశాంత్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మందాడి శ్రీహరి, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు కేఎస్ లక్ష్మణరావు బాపయ్యకు జ్ఞాపిక, మెరిట్ సర్టిఫికెట్ అందజేసి దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా బాపయ్యను నిజాంపట్నం జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం పి.శివన్నారాయణ, యూటీఎఫ్ నిజాంపట్నం మండల శాఖ అధ్యక్షులు వై.శ్రీని వాసరావు, ప్రధాన కార్యదర్శి సి.హెచ్. గణేష్‌రావు, జనవిజ్ఞాన వేదిక బాపట్ల జిల్లా అధ్యక్షులు దబ్బకూటి హరిబాబు, పి.సుబ్బారావు, మండలంలోని ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

సునీత, రాంబాబులకు సన్మానం



విశాలాంధ్ర - జె.పంగులూరు : మండల పరిధిలోని రేణంగివరం, పంగులూరు పంచాయితీ కార్యదర్శులుగా పనిచేసి డిప్యూటీ ఎంపీడీఓలుగా పదోన్నతి పొంది బదిలీపై వెళ్లిన ఎల్.సునీత, బి.రాంబాబులకు జె.పంగులూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు అభినందన సన్మాన కార్యక్రమన్ని ఏర్పాటు చేశారు. జెపంగులూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి కె.స్వరూపరాణి అధ్యక్షతన జరిగిన ఈ అభినందన కార్యక్రమంలో జె.పంగులూరు మండలం నందు సదరు ఉద్యోగులు పంచాయితీ కార్యదర్శుల స్థాయిలో చేసిన సేవలను గుర్తుచేసుకొని ప్రశంసించారు. అనంతరం ఎల్ సునీత, బి రాంబాబులను ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో డెప్యూటీ.ఎంపీడీఓ కె సుమంత్ ఎమ్మిఓ పి శ్రీనివాసులు రెడ్డి మండల పరిషత్ ఉపాధ్యక్షులు ఎర్రం శ్రీనివాసరెడ్డి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రావూరి రమేష్ మండల నాయకులు కుక్కపల్లి ఏడుకొండలు, గుర్రం శేఖర్, చింతల సహదేవుడు, ఓబులరెడ్డి, సింగర్, మురకొండ సుబ్బారావు, రాయని వెంకట సుబ్బారావు, గాదె బ్రహ్మారెడ్డి, పంచాయితీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రామచంద్రరావు మృతి వైసీపీకి తీరని లోటు

విశాలాంధ్ర - చీరాల రూరల్ : చీరాల మండలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు, బోయినవారిపాలెం గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు చప్పిడి రామచంద్రరావు అనారోగ్యంతో మంగళవారం కన్నుమూశారు. ఆయన మృతి పార్టీకి, స్థానిక రాజకీయాల కు తీరని అన్నారు. రామచంద్రరావు మరణవార్త తెలిసిన వెంటనే చీరాల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కరణం వెంకటేష్ బాబు వారి నివా సానికి చేరుకుని పార్థివదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యక ర్తలు, అభిమానులు పాల్గొని కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. రామచంద్రరావు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఆయన ఆశయాలను కొనసాగిస్తామని నేతలు పేర్కొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం

విశాలాంధ్ర - చీరాల టౌన్ : వేటపాలెం పోలీస్ స్టేషన్‌లో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేటపాలెం ఎస్సై పెనుమాల జనార్ధన్ మాట్లాడుతూ వికలాంగులు ఎవరికి తీసిపోరు సమాజంలో వారికి సమాన హక్కులు గౌరవం లభించాలి అంటూ పిలుపునిచ్చారు. నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవాసమితి ఆధ్వర్యంలో ఎస్సై జనార్ధన్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్ర అధ్యక్షులు కేక్ తినిపించి హర్షం వ్యక్తం చేశారు. వికలాంగుల సమస్యలు, వారి హక్కుల పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఇరుపని వెంకటేశ్వర్లు, శాలహే రవితేజ, అనిల్ నాయుడు, కృపారావు, మందారపు బసవమ్మ, కే అవ్వమ్మ, భాస్కర్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేందుకు సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-ఫిరంగిపురం : మండలంలో ఆయా గ్రామాల్లో ప్రజా సమస్యలు పరిష్కారానికి మండల అభివృద్ధిపై దృష్టి సారించేందుకు ప్రభుత్వ సూచనల మేరకు సర్వసభ్య సమావేశం నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సర్వసభ్య సమావేశానికి గైర్హాజరు కాకుండా ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖలకు చెందిన అధికారులు, మండల అధికారులు ఐక్యంగా పాల్గొని అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని ఎంపీపీ షేక్ సహేలా నర్గీస్ అన్నారు. గురువారం ఎంపీపీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయా గ్రామాలకు చెందిన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పలు అంశాలపై చర్చించారు. అదేవిధంగా వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు మండలంలో సీసీ రోడ్లు, పచ్చదనం, పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు పలు కీలక అంశాలపై చర్చించారు.

సమావేశంలో అందరూ సానుకూల స్పందన ఇచ్చినట్లు ఎంపీడీఓ శివసుబ్రమణ్యం అభినందనలు తెలిపారు. స్థలం ఉండి ఇంటి నిర్మాణం చేసుకునే వారు, స్థలం లేని వారు ఈ నెల 28వ తేది లోపు ఆయా గ్రామ సచివాలయాల్లో దరఖాస్తులు అందజేయాలని ఎంపీడీఓ సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జె.ప్రసాదరావు, డిప్యూటీ ఎంపీడీఓలు కొల్లి విష్ణువర్ధన్ రావు, వెంకటేశ్వర్లు, ఆయా గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంఈఓ సుభాని, ఏపీఎం నాగేశ్వరరావు, ఏపీఓ కిరణ్మయి, పంచాయితీ రాజ్ శాఖ ఏఈ వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీక్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర - వేమూరు : సర్వ మానవాళికి శాంతి, ప్రేమ, దయ గుణం కలిగి ఉండాలని ఏసుక్రీస్తు బోధనలు ఆచరణీయమని విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసరావు తెలియజేశారు. గురువారం స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయంలో విద్యుత్ ఉద్యోగులతో కలిసి సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి వాక్య సందేశాన్ని అందించి , కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో అధికారులు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

వెలుగు ప్రాజెక్ట్ కార్యాలయంలో...

విశాలాంధ్ర - రేపల్లె : డిఆర్‌డిఏ వెలుగు ప్రాజెక్ట్ రేపల్లె కార్యాలయంలో గురువారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా టిడిపి సీనియర్ నేత అనగాని శివప్రసాద్ పాల్గొని సెమీ క్రిస్మస్ గూర్చి మాట్లాడుతూ బాల యేసు పుట్టుకను ప్రపంచ దేశాలన్నీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకుంటారని , క్రీస్తు మార్గంలో ప్రతి ఒక్కరు పైనుంచి సన్మార్గంలో నడవాలని ఆయన ప్రసంగించారు. అనంతరం సెమీ క్రిస్మస్ కేకు కట్ చేసి విచ్చేసిన అతిథులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రవి బాబు, ఏపీఎం అత్తులూరి గోపి, సిసి సొంటి పూర్ణచంద్రరావు, దున్న ఆనంద్, ఎండి. నూరీన్ నిస్స, సోమేశ్వరి, అకౌంటెంట్ ప్రసన్న అకౌంటెంట్ ప్రసన్న, యానిమేటర్లు సంధ్య, తిరుపతమ్మ, రమణ రమణ, మల్లేశ్వరి, మరియమ్మ పాల్గొన్నారు.

కొత్తపేటలో....

విశాలాంధ్ర - చీరాల టౌన్ : సేవే నిజమైన నాయకత్వం అని సీఐ నాగభూషణం కొనియాడారు. కొత్తపేటలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలలో గురువారం ఆయన పాల్గొని మాట్లాడారు. పేదల అవసరాన్ని గుర్తించి చీరల పంపిణీ చేయటం అభినందనీయమైన కార్యక్రమంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ యనమల శామ్యూల్, మాజీ వార్డు మెంబర్ పాకల శ్రీను, జర్నలిస్ట్ పేరాల జనార్దన్‌లు సంఘ పెద్దలు యెహను, చిన్నా, ఆనందు, చుండూరు సాంబయ్య, శ్రీనివాసరావు ప్రశాంత్ గౌడ్ పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో....

విశాలాంధ్ర - జెపంగులూరు : మండల ప్రజా పరిషత్ కార్యాలయము ఆవరణలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె.స్వరూపరాణీ అధ్యక్షతన సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్రీస్తు బోధనల వల్ల కలుగు మంచిని పాస్టర్స్ కె.ప్రభాకర్, జె.రవికుమార్ వివరించారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ.ఎంపీడీఓ కె సుమంత్, మండల పరిషత్ ఉపాధ్యక్షులు యర్రం శ్రీనివాసరెడ్డి మండల టీడీపీ నాయకులు గుర్రం శేఖర్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గడ్డం హనుమంతరావు ఏపిఓ కె.సంతోషం టంగుటూరు మండల ఎమ్మిఓ ఎల్.సునీత పంచాయతీ కార్యదర్శులు ఆర్‌ఎల్‌ఎన్ కుమార్, డి.నిర్మల, తమ సందేశాలను వినిపించారు అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేసి అందరికి పంచారు. ఈ కార్యక్రమంలో మండల ఎమ్మిఓ పి శ్రీనివాసులరెడ్డి, పంచాయితీ కార్యదర్శులు, డేటా ఎంట్రీ ఆపరేటర్స్, ఉపాధిహామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

బస్సు నిలుపుదలకు చెత్త తొలగింపు

విశాలాంధ్ర-మద్దిపాడు : రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త కారణంగా బస్సులు, ఇతర వాహనాలు రోడ్డుపైనే ఆగి ట్రాఫిక్ అంతరాయం ఏర్పడటంతో పాటు ప్రమాదాలకు అవకాశం ఉన్న మద్దిపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రోత్ సెంటర్ (బ్లాక్ స్పాట్) ప్రాంతంలో, జిల్లా ఎస్పీ స్వయంగా పరిశీలన చేసి తక్షణ చర్యలు చేపట్టడంతో ప్రమాదాల నివారణకు అనుకూలమైన పరిస్థితులు ఏర్పడ్డాయి. రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా జిల్లా ఎస్పీ మంగళవారం(ఈ నెల 16 తేదీన) మద్దిపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రోత్ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పారిశ్రామిక వాడలో పనిచేస్తున్న మహిళలు, పురుషులు వివిధ ప్రాంతాల నుండి వచ్చి వెళ్లే సమయంలో రోడ్డుపైనే నిలబడి బస్సులు ఎక్కడం, బస్సులు కూడా రోడ్డుపైనే ఆగడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని, ప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉందని గమనించారు.

అక్కడ ప్రయాణికులు కూడా సమస్యను జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకొని వచ్చారు. ఆర్టీసి అధికారులతో మాట్లాడి.. బస్సును మార్జిన్ లో ఆపే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించా రు. ఇదిలా ఉంటే మార్జిన్‌లో చెత్త చెదారం పేరుకుపోవడం వల్ల వాహనాలు అక్కడ నిలపలేక రోడ్డుపైనే ఆగాల్సి వస్తోందని జిల్లా ఎస్పీ గుర్తించా రు. ఈ పరిస్థితి వలన ప్రయాణికులకు, వాహన దారులకు ప్రమాదాలు జరిగే అవకాశముందని సంబంధిత పోలీస్ అధికారులకు స్పష్టమైన సూచన లు చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఒంగోలు డి.ఎస్.పి ఆర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఒంగోలు రూరల్ సీఐ యన్. శ్రీకాంత్ బాబు మరియు మద్దిపాడు ఎస్సై వెంకట సూర్య వెంటనే స్పందించి, జెసిబిల సహాయంతో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని పూర్తిగా తొలగించారు. శుభ్రం చేసిన ప్రదేశంలో ఇకపై చెత్త వేయకుండా స్థానిక ప్రజలకు అక్కడ ఉన్న షాపులు వాళ్లకు అవగాహన కల్పించడంతో పాటు, అక్కడ చెత్త వేయకుండా పలు సూచనలు చేశారు. చెత్త తొలగించిన అనంతరం, ఆ ప్రాంతాన్ని బస్సులు మరియు ఇతర వాహనాలు సురక్షితంగా ఆగేందుకు అనుకూలంగా ఉంది. ఇకపై బస్సులు సర్వీస్ రోడ్లలో ఆగే విధంగా చర్యలు తీసుకున్నారు. దీంతో ట్రాఫిక్ అంతరాయం తగ్గడంతో పాటు, ప్రమాదాల అవ కాశాలు కూడా గణనయంగా తగ్గుతుంది.

జిల్లా ఎస్పీ చొరవతో చేపట్టిన ఈ చర్యల వల్ల ఆ ప్రాంతంలో పనిచేసే కార్మికులు, ప్రయాణికులు, వాహనదారులు సురక్షితంగా రాకపోకలు సాగించగలుగు తారని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. రోడ్డు భద్రతపై జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది.

అర్హులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : అర్హులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఎం జిల్లానాయకులు జె జయంతిబాబు పేర్కొన్నారు. గురువారం మండలంలోని అమ్మనబ్రోలు లో గత ప్రభుత్వంలో ఇండ్లపట్టాల కొరకు కొనుగోలు చేసిన భూముల వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జయంతిబాబు మాట్లాడుతూ గతప్రభుత్వంలో ఘుమారు కోటి రూపాయలు వెచ్చించి 7ఎకరాలు భూమిని కొనుగోలు చేసిందని దాంతో పేదలకు పట్టాలు ఇచ్చేందుకు అర్హుల జాబిత తయారు చేసారు. ఆ జాబితాలో అవకతవకలు ఉన్నాయని అప్పట్లో రాజకీయ కారణాలతో కోర్టును ఆశ్రయించారు తద్వార పట్టాలు పంపిణీ ఆగిపోయింది అప్పటినుండి అవతవకలను సరిచేసి పేదలకు పట్టాలు ఇవ్వవలసి ఉండగా గతప్రభుత్వం మూడుసంవత్సరాలు కూటమి ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలవు చున్న వాటి ఊసే పట్టించు కోలేదని విమర్శించారు దాంతో పేదలు ఇండ్ల స్దలాలు లేక పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు ఒక్క ప్లాంటు కొనుగోలు చేయాలన్నా 3 నుండి 4 లక్షల వరకు ఖర్చు అవుతుందన్నారు. ఈ నేపద్యంలో ప్రభుత్వం కొనుగోలు చేసిన భూముల్లో సుమారు 300 మంది పేదలకు పట్టాలు ఇచ్చేందుకు అవకాశం ఉన్నా ప్రభుత్వం ఆవైపుగా చర్యలు తీసుకోవడం లేదన్నారు. దాంతో కోటిరూపాయలు ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని ఆవేదన వ్యక్తం చేసారు ఇప్పటికైన ప్రభుత్వం పునరాలోచించి అర్హులైన పేదలకు ఇళ్ల స్దలాలు మంజూరు చేయాలని లేనిచో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పేదలను ఐక్యం చేసి ఇండ్ల పట్టాలు ఇచ్చేవరకు ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి టి శ్రీకాంత్ ,స్టాలిన్ ,సుందరయ్య ,ప్రభుదాస్ ,ప్రసన్న,గురిజాల సుబ్బయ్య,లాజర్ ,తదితరులు పాల్గొన్నారు.

వీగిన అవిశ్వాసం తీర్మానం

-చైర్మన్‌గా మళ్లీ చిర్లంచర్ల

విశాలాంధ్ర-మార్కాపురం : ప్రకాశంజిల్లా మార్కాపురం మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాల మురళీకృష్ణపై ఈ ఏడాది జూన్ 11వ తేదీన టీడిపి కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసతీర్మానాన్ని రద్దుచేస్తూ మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్ సురేష్ కుమార్ ఉత్తర్వులు. జారీచేశారు. ఈ ఉత్తర్వులు గత నెల 27న జారీ అయినప్పటికీ గురువారం జీవో కాపీ బయటకు వచ్చింది. అవిశ్వాసతీర్మానానికి మద్దతుగా 24 మంది కౌన్సిల్ సభ్యులు సంతకాలు చేసి ప్రభుత్వానికి పంపారు. జూన్ 11న మున్సిపల్ కౌన్సిల్ హాలులో జరిగిన ప్రత్యేక సమావేశంలో 19 మంది మాత్రమే తీర్మానానికి మద్దతుగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. సాంకేతికంగా అవిశ్వాసతీర్మానం చెల్లుబాటు కాకపోవడంతో అవిశ్వాస తీర్మానాన్ని రద్దుచేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీనితో మళ్లీ మున్సిపల్ చైర్మన్‌గా వైయస్సార్సిపికి చెందిన చిర్లంచర్ల బాలమురళీకృష్ణ విధుల్లోనికి రానున్నారు.

ఎస్ఐను కలిసిన షేక్షావలి

విశాలాంధ్ర-పెద్ద దోర్నాల : దోర్నాల పోలీస్ స్టేషన్‌లో నూతన ఎస్ఐగా యస్. వెంకట రమణయ్యను గురువారం స్థానిక పోలీస్ స్టేషన్లో దోర్నాల సేఫ్టీ డ్రైవర్ అధ్యక్షుడు షేక్ షేక్షావలి దోర్నాల యస్ఐనీ మర్యాద పూర్వకంగా కలిశారు. ఎస్సై వెంకట రమణయ్యకు, పూలమాలతో సెలవులతో సన్మానించారు. దోర్నాల సేఫ్టీ డ్రైవర్ అధ్యక్షుడు షేక్ షేక్షావలి, నూతన ఎస్ఐ యస్. వెంకట రమణయ్యను పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్లు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : మండలంలోని ఎరువుల దుకాణాలను ఇంటర్నల్ స్క్వాడ్ అధికారి అయినా కె.రాజశ్రీ, సహాయ వ్యవసాయ సంచాలకులు, ఎరువుల దుకాణాలను గురువారం తనిఖీ నిర్వహించారు. మండలంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి ఎరువుల నిల్వ లను, స్టాక్ రెజిస్టర్స్ లను, స్టాక్ బోర్డ్స్ లను, బిల్లు బుక్స్ లను పరిశీలించి, లైసెన్స్ నందు'ఒ 'ఫారాలు లైసెన్స్ నందు పొందుపరచని 38.950 మెట్రిక్ టన్నుల ఎరువులను వాటి విలువ రూ :9,20,778 గల ఎరువులను అమ్మకాలు నిలుపుదల చేసినట్లు తెలిపారు, ఈ తనిఖీలో శ్రీశ్రీ గురు సాయి ట్రేడర్స్ నందు 22.400 మెట్రిక్ టన్నుల ఎరువులు విలువ రూ :6,65,050, శ్రీ శ్రీనివాస ట్రేడర్స్ నందు 8.100 మెట్రిక్ టన్నుల ఎరువుల విలువ రూ :93150 మరియు కరోమండేల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ దుకాణం నందు 8.450 మెట్రిక్ టన్నుల ఎరువుల విలువ రూ.1,62,578 ఎరువుల అమ్మకాలు నిలుపుదల చేయడం జరిగింది, అలాగే ఎమ్మార్పీ ధరలకు మాత్రమే ఎరువులు అమ్మకాలు చేయాలనీ, రైతులకు రసీదు లు తప్పనిసరిగా ఇవ్వాలని తెలిపారు. ఈ తనిఖీ లో స్థానిక మండల వ్యవసాయ అధికారి డి. జవహర్ లాల్ నాయక్, గిద్దలూరు మండల వ్యవసాయ అధికారి, వై. విజయభాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

గుండెపోటుతో లైన్‌మెన్ మృతి

విశాలాంధ్ర-తాడేపల్లి : మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని తాడేపల్లి విద్యుత్ శాఖలో లైన్ మెన్‌గా విధులు నిర్వహిస్తున్న సురేంద్ర(53) గురువారం తెల్లవారుజామున గుండెపోటుతో కన్నుమూశారు. ఆయన మరణ వార్త తెలుసుకున్న ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సంజీవరావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేష్ బాబు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లక్ష్మినారాయణ సురేంద్ర భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సంజీవరావు మాట్లాడుతూ ఎలక్ట్రికల్ లైన్ మెన్ సురేంద్ర గుండెపోటుతో చనిపోవడం బాధాకరమని అన్నారు. వారి కుటుంబానికి డిపార్ట్మెంట్ అండగా ఉంటుందన్నారు. కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వనున్నట్లు తెలిపారు. మట్టి ఖర్చులకు రూ.25 వేల ఆర్థిక సహాయం అందజేసినట్లు తెలిపారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. నివాళులర్పించిన వారిలో విద్యుత్ శాఖ సిబ్బంది ఉన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన ఉండాలి

విశాలాంధ్ర-మద్దిపాడు : కుష్టు వ్యాధి మొదట దశలో గుర్తిస్తే నయం చేసుకోవచ్చని మద్దిపాడు పీహెచ్సీ డాక్టర్ శ్రావణ్ కుమార్ తెలిపారు. గురువారం మద్దిపాడు ఆరోగ్య కేంద్రంలో పరిధిలో కుష్టు వ్యాధి పై ఇంటింటి కీ సర్వే నిర్వహించారు. డాక్టర్ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ కుష్టు వ్యాధి నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని 2027 వరకు కుష్టు వ్యాధి కేసులు జీరోకి తగ్గించాలని ఏటా వైద్య సిబ్బంది ద్వారా ముందుగానే లక్షణాలను గుర్తించి వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. మొఖంపై మచ్చలు స్పర్శ లేకుండా ఉంటే అలాంటి లక్షణాలు ఉన్నవారు వైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు ముక్కు నొక్కబిడి ఉంటుందని తెలిపారు. ముందుగా గుర్తిస్తే అంగవైకల్యం లేకుండా మందులతో వ్యాధిని నయం చేసుకోవచ్చని తెలిపారు కుష్టు వ్యాధి ఒకరి నుంచి మరొకరికి సోకదని తెలిపారు ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ బాలకోటయ్య వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎరువు దుకాణాలు తనిఖీ

విశాలాంధ్ర - కొరిశపాడు : మండలంలోని ఎరువుల లైసెన్స్ కలిగిన డీలర్స్ దుకాణాలను ఇంటర్నల్ స్క్వాడ్ అధికారి కె.సుదర్శన్ రాజు తనిఖీ చేయడం జరిగింది. ఎరువుల లైసెన్స్ డీలర్ లైసెన్స్ కాలపరిమితిని తనిఖీ చేస్తూ అదేవిధంగా ఈ పాస్ డిబిటి మెషీన్‌లో ఉన్న ఎరువుల క్లోజింగ్ స్టాక్‌ను ఫిజికల్ బ్యాలెన్స్ స్టాక్ తనిఖీ నిర్వహించారు. ఎరువుల నియంత్రణ చట్టం ప్రకారం ఒఫామ్‌లో ఫారంలో లైసెన్స్‌లో చేర్చకుండా ఎరువులు అమ్మితే ఆ డీలర్ పై చర్యలు తీసుకోవడం జరుగుతుంది హెచ్చరించారు. ఈ తనిఖీలో మండల వ్యవసాయ అధికారి ఎస్. రామ మోహన్ రెడ్డి, సొసైటీ అధికారులు పాల్గొన్నారు.

చిన్న తరహా పరిశ్రమలకు ప్రోత్సాహం

విశాలాంధ్ర - వేమూరు : చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ రామకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం మీటింగ్ హాల్లో పారిశ్రామికవేత్తలు ఉద్యమ ఆధార్ రిజిస్ట్రేషన్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సదస్సులో ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులు యువ పారిశ్రామికవేత్తలుగా ఎదగాలన్నారు. కుటీర పరిశ్రమల ఏర్పాటుకు పిఎంఈజీ రుణం, పీఎంఎఫ్ఈ రుణం, పొందాలంటే ఉద్యమ ఆధార్ నమోదు కావాలని, దీని ద్వారా బ్యాంకు రుణాలు పొంది సబ్సిడీ వినియోగించుకోవచ్చని సూచించారు. పరిశ్రమ శాఖ ద్వారా కోటి రూపాయల వరకు రుణం అందించేందుకు సహకరిస్తామని ముద్ర రుణాలు కూడా పొందవచ్చు అని తెలియజేశారు. ఈ సందర్భంగా వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవికుమార్, ఐపీఓ సురేంద్ర, ఏపిఎం శోభన్ బాబు, ఎమ్మెస్ఎంయు లబ్ధిదారులు ఉన్నారు.

నేడు సామాజిక తనిఖీ

విశాలాంధ్ర- కురిచేడు : మండలంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రజా వేదిక కార్యక్రమమును తనిఖీ బృందం నేటి వరకు గ్రామాలలో తనిఖీ చేసి గ్రామ సభలు నిర్వహించి సామాజిక తనిఖీపై స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నేడు ఉదయం 10 గంటలకు సమావేశం ఏర్పాటు జరుగుతుందని ఎంపీడీవో సత్యప్రసాద్ తెలియజేశారు. మండలాధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు మండల స్థాయి అధికారులు పంచాయతీ కార్యదర్శులు ఉపాధి హామీ కూలీలు మెట్లు ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది సకాలంలో హాజరుకావాలని తెలియజేశారు.

డిప్యూటీ ఎంపీడీవోను కలిసిన మైనార్టీ నాయకులు

విశాలాంధ్ర-పామూరు రూరల్ : స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డిప్యూటీ ఎంపీడీవో హాజరత్ అలీ ని మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ హాజీ గౌస్, షేక్ గౌస్ బాషా, ఆర్ఆర్ రఫీ, కోటగుళ్ల నాయబ్ రసూల్, కాజా రహమతుల్లా, ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ మొబీనా మౌలాలి, పులి నాయక, ఖాదర్ బాషా, కావేరి రసూల్, తదితరులు పాల్గొన్నారు.

నోటీసు

మహారాజశ్రీ తెనాలి 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఓ.యస్. నెం. 620/2024

బిట్వీన్ :

Mendu Hima Bindu ...వాది

మరియు

Soma Anil Kumar & Others ...ప్రతివాదులు

To:
D-4:Soma Rama Durga, W/o.Late Mallikharjuna Rao, age 58 Years, House Wife, R/o.Door No.3-100, Kolluru (Po &MD), Bapatla Dist.
D-5:Pothana Venkata Naga Lakshmi, Teacher, W/o.Srinivas, R/o.Door No.3-100,Kolluru (Po &MD), Bapatla Dist.

పై నెంబరు దావాలో మీకు శ్రీ కోర్టుద్వారాను మరియు పోస్టు ద్వారాను సమన్లు చేయించినను, మీరు తీసుకోనందున ఈ ప్రకటన ద్వారా నోటీసు నిమిత్తం శ్రీ కోర్టువారు ఆర్డరు వేస్తూ మీ హాజరు కొరకు ది.30-12-2025 తేదికి వాయిదా వేసి యున్నారు. సదరు వాయిదా రోజు ఉ॥గం॥10.30 ని॥లకు మీరు స్వయంగా గాని, న్యాయవాది ద్వారా గాని శ్రీ కోర్టువారి ఎదుట హాజరై మీ అక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల సదరు దావాను మీ పరోక్ష మందున విచారించి తీర్మానించబడును. (శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో)

జి. ప్రశాంత్ కుమార్,
వాది తరపు అడ్వకేట్, తెనాలి. సెల్ : 9849046802